మీ వ్యాపార వృద్ధికి మా సహకారం
మీ టాక్స్ సమస్యలకు
GST FOR YOU
ఒకే పరిష్కారం!
నమ్మకం మా బలం | సేవ మా ధ్యేయం | మీ వ్యాపార వృద్ధికి మా సహకారం
GST SERVICES: GST Registration, GST Returns, GST Refund Filing, GST Training
INCOME TAX SERVICES: Income Tax Filing, Refund Management, All Firms ITR Filing
OTHER SERVICES: Company Registration, E-Paper Website, Web Development, Digital Marketing, Tally Prime & Accounting Software
మీ వ్యాపార వృద్ధికి మా సహకారం
సంప్రదించండి: 9666615177
E-Mail : gstforyou@outlook.com
Website : www.gstforyou.com
Address : 13/3 Arundel Pet, Guntur - 522002
GST FOR YOU - మీ వ్యాపార వృద్ధికి మా సహకారం



తెలుగు వార్త వార పత్రిక
RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 38 | 21.9.2026 నుంచి 27.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |



RS KISAN
రైతు సేవలో కిసాన్ సంస్థ
డోరు నెం.18-6-12/3 రు, గుండెపూడివారివీధి, సూర్యటాకీస్ వెనుక, అచ్చంపేట రోడ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522403.
సెల్ : 99850 88918, 95811 46699
Mail ID : raithusevalokisansamstha@gmail.com
మా వద్ద లభించు వ్యవసాయ పరికరాలు - వివరాలు
యంత్రాలు & ఇంజన్లు
తైవాన్ ఇంజన్ (టాప్ క్వాలిటీ) | గ్రౌండ్స్ నీళ్ల ఇంజన్లు | నీళ్ల ఇంజన్లు | 3-ఇంచ్ నీటి పంపు
కట్టింగ్ పరికరాలు & ఇంటర్-కల్టివేషన్
బ్రష్ కట్టర్స్ | షాప్ కట్టర్స్ | నడిచే రోటవేటర్ | కోత పరికరాలు
స్ప్రేయర్లు & మొక్కల రక్షణ
స్ప్రేయర్లు | సీడర్లు | మోటార్ స్ప్రేయర్
విడిభాగాలు & సేవలు
అన్ని రకాల విడిభాగాలు
(ప్రభుత్వ సబ్సిడీ మరియు పథకాలు అందుబాటులో ఉన్నాయి)
Account Details : HDFC BANK A/C No:50200047394926, IFSC:HDFC0002397





# జంపింగ్ నేతల చూపు..

- వైసీపీ నుంచి వలసలు.. జనసేనకు ఎందుకు దూరం?
- జంపింగ్ నేతల చూపంతా టీడీపీపైనే..
- జనసేన మాత్రం ఎందుకు నింపుకోలేకపోతోంది?
- జనసేన గడప తొక్కని వైసీపీ నేతలు.. ?
- చేరికలకు 'పవన్ ఫిల్టర్' అడ్డంకేనా?

**అమరావతి: వైసీపీ నుంచి వలసల జోరు పెరుగుతున్న వేళ.. కూటమిలో టీడీపీకి కొత్త నేతలు క్యూ కడుతుంటే జనసేన మాత్రం ఆ స్థాయిలో వలసలను ఆకర్షించలేకపోతోందన్న చర్చ మొదలైంది. అధికార పార్టీగా టీడీపీకి ఉన్న సంస్థాగత బలం ఒక కారణమైతే.. జనసేనలో చేరిన తర్వాత తమ రాజకీయ ప్రాధాన్యత ఎలా ఉంటుందన్న సందేహం మరో కారణంగా కనిపిస్తోంది.**

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నేతల వలసలు కొనసాగుతున్న వేళ.. కూటమిలోని రెండు ప్రధాన రాజకీయ వేదికల్లో ఒకటైన జనసేన కంటే తెలుగుదేశం పార్టీవైపే ఎక్కువ మంది సీనియర్ నేతలు మొగ్గు చూపుతున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసిన వెంటనే టీడీపీలో చేరడం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. ప్రతిపక్ష పార్టీ నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమిలో రెండు రాజకీయ వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఎక్కువ మంది టీడీపీ వైపు ఎందుకు అడుగులు వేస్తున్నారు? జనసేన వైపు ఎందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు? ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో ఈ ప్రశ్న చర్చనీయాంశంగా మారింది.**

### పవన్ 'ఫిల్టర్'.. చేరికలకు బ్రేక్?

మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీలోకి వచ్చే నేతల విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారన్నది కూడా రాజకీయ చర్చలో మరో అంశం. అయితే జనసేన పూర్తిగా చేరికలకు తలుపులు మూసివేసిందని చెప్పడానికి ఆధారాలు లేవు. 2026 జూన్‌లో పార్టీ రాష్ట్ర స్థాయి 14 మంది సభ్యుల జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేసి, పార్టీ బలోపేతం కోసం చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వార్తలు వచ్చాయి. అంటే సమస్య 'చేరికలు లేవు' అనే దానికంటే.. ఎవరిని చేర్చుకోవాలి? ఎలాంటి రాజకీయ నేపథ్యం ఉన్నవారికి అవకాశం ఇవ్వాలి? పార్టీలో ఇప్పటికే ఉన్న కేడర్‌తో వారిని ఎలా సమన్వయం చేయాలి? అన్న విధానంలో ఉండొచ్చన్న అభిప్రాయం ఉంది. జనసేనలో దీర్ఘకాలంగా పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలనే దిశగా పార్టీ వ్యవస్థలో చర్చ జరుగుతున్నట్లు కూడా వార్తలు వచ్చాయి.

### జనసేనలో చేరితే ప్రాధాన్యత ఉంటుందా?

వైసీపీ నుంచి బయటకు వస్తున్న సీనియర్ నేతలకు ప్రధానంగా కావాల్సింది రాజకీయ పునరావాసం మాత్రమే కాదు.. తమ నియోజకవర్గాల్లో రాజకీయంగా క్రియాశీలంగా ఉండేందుకు అవసరమైన స్థానం, వ్యవస్థ, అనుచరగణం, కూటమిలో సమన్వయం. ఇక్కడే జనసేనపై కొందరు నేతల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలను రాజకీయ వర్గాలు ఉదాహరణగా చూపుతున్నాయి. బాలినేని జనసేనలో చేరిన తర్వాత కూడా ఒంగోలు రాజకీయాల్లో టీడీపీ నేతలతో ఆయనకు బహిరంగ విభేదాలు తలెత్తాయి. ఆగస్టులో బాలినేని, టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయికి వెళ్లడంతో టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ జోక్యం చేసుకుని ఇద్దరూ సంయమనం పాటించాలని సూచించింది. ఈ పరిణామాన్ని చూసిన ఇతర పార్టీల సీనియర్ నేతలు.. జనసేనలో చేరిన తర్వాత కూడా స్థానికంగా టీడీపీ నాయకత్వంతో సమన్వయం సవాలుగా మారితే తమ రాజకీయ స్థానం ఏమవుతుందనే లెక్కలు వేసుకుంటున్నారన్న విశ్లేషణ వినిపిస్తోంది.

### టీడీపీయే ఎందుకు 'సేఫ్'గా కనిపిస్తోంది?

వైసీపీ నుంచి బయటకు వస్తున్న నేతలకు టీడీపీ ఒక పాత, విస్తృతమైన రాజకీయ వ్యవస్థగా కనిపిస్తోందన్నది మరో విశ్లేషణ. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు ఇప్పటికే ఉన్న పార్టీ నిర్మాణం, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కేడర్ వ్యవస్థ, అధికార పార్టీగా ఉన్న ప్రస్తుత రాజకీయ స్థానం.. ఇవన్నీ తమకు తిరిగి రాజకీయ పునాదిని నిర్మించుకోవడానికి ఉపయోగపడతాయని కొందరు నేతలు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ యంత్రాంగం కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చే నేతలు తమ అనుచర వర్గాన్ని కూడా రాజకీయంగా నిలబెట్టుకోవాలంటే ఇప్పటికే విస్తృతంగా ఉన్న సంస్థాగత వ్యవస్థ ఉన్న పార్టీలో చేరడానికే మొగ్గు చూపుతున్నారన్న విశ్లేషణ వినిపిస్తోంది.

### జనసేనలో ఇమడగలమా?

ఇదే సమయంలో జనసేనలో చేరాలనుకునే వైసీపీ మాజీ నేతల ముందున్న మరో ప్రశ్న.. తమ రాజకీయ శైలి, గత అనుభవాలు, స్థానిక సమీకరణాలు జనసేన రాజకీయ సంస్కృతిలో ఎంతవరకు ఇమడతాయి?జనసేన తన సంస్థాగత నిర్మాణాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తోంది. పార్టీ జాతీయ స్థాయిలోనూ విస్తరించాలనే లక్ష్యాన్ని ప్రకటించినట్లు ది ప్రింట్ నివేదించింది. కానీ కొత్తగా వచ్చే సీనియర్ నేతలకు తక్షణ రాజకీయ స్థానం కల్పించడం, ఇప్పటికే ఉన్న కేడర్‌తో వారిని సమన్వయం చేయడం, కూటమి భాగస్వామి టీడీపీతో స్థానిక స్థాయిలో సమీకరణాలను నిర్వహించడం.. ఇవన్నీ ఆ పార్టీకి ప్రత్యేక సవాళ్లుగా కనిపిస్తున్నాయి.

### వైసీపీ బలహీనత.. జనసేనకు అవకాశం కూడా..

వైసీపీ నుంచి నేతలు బయటకు వస్తున్న పరిణామం జనసేనకు ఒకవైపు అవకాశం. మరోవైపు సవాలు కూడా. వైసీపీకి చెందిన బలమైన నాయకత్వం, స్థానిక నెట్‌వర్క్ ఉన్న నేతలను ఆకర్షిస్తే జనసేనకు నియోజకవర్గ స్థాయిలో సంస్థాగత బలం పెరగవచ్చు. అదే సమయంలో ప్రతి సీనియర్ నేతను పార్టీలోకి తీసుకోవడం వల్ల ఇప్పటికే ఉన్న కేడర్‌తో సమన్వయం, స్థానిక ఆధిపత్య పోరులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందుకే పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న చేరికల విధానం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. వైసీపీ నుంచి నేతలు బయటకు వస్తున్నారు.. టీడీపీ వారిని ఆహ్వానిస్తోంది.. జనసేన మాత్రం ఎంపిక చేసుకుని అడుగులు వేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ మూడు పార్టీల సంస్థాగత బలాబలాలపై ఈ వలసల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరమైన రాజకీయ అంశంగా మారింది.



# రాణిగారితోటలో చంపేశారు!

### సాయికృష్ణ కస్టోడియల్ మృతిపై 'సిట్' దర్యాప్తులో సంచలన అంశాలు



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్‌ఏపిఎన్):** విజయవాడ సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విజయవాడ రాణిగారితోటలోని పాడుబడిన భవనంలో సాయికృష్ణను దారుణంగా కొట్టి చంపినట్లు ఏ4 నిందితుడు గులివిందల సురేష్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రూపొందించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు సమాచారం. తీవ్ర గాయాలతో ఉన్న సాయికృష్ణ తనను చంపేందుకే కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ నిందితులు కనికరం చూపలేదని దర్యాప్తులో వెల్లడైనట్లు సిట్ పేర్కొంది.

సిట్ రిమాండ్ రిపోర్టు ప్రకారం.. మే 7న పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ అశోక్, నాని కలిసి సాయికృష్ణను కొట్టినట్లు సురేష్ వెల్లడించాడు. అనంతరం సీఐ నాగరాజు ఆదేశాలతో తీవ్ర గాయాలపాలైన సాయికృష్ణను రాణిగారితోటలోని పాత పాడుబడిన భవనానికి తరలించినట్లు పేర్కొన్నాడు. మే 12న సీఐని కలిసేందుకు వెళ్లిన సమయంలో ఆ భవనంలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న సాయికృష్ణను తాను చూసినట్లు సురేష్ తెలిపాడు. అదే సమయంలో సాయికృష్ణ తనను చంపేందుకే కొడుతున్నారని తీవ్ర గాయాలతో చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సురేష్‌తో మాట్లాడుతున్న సమయంలోనే సాయికృష్ణ స్పృహతప్పి పడిపోయి మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మే 12 అర్ధరాత్రి సాయికృష్ణ మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి మోటార్‌సైకిల్‌పై స్వర్గపురి శ్మశానవాటికకు తరలించినట్లు సురేష్ వెల్లడించాడు. అక్కడ సీఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ అశోక్, సురేష్ కలిసి మృతదేహాన్ని దహనం చేసినట్లు పేర్కొన్నాడు. మృతదేహం పూర్తిగా కాలిపోయే వరకు వారు అక్కడే ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించినట్లు సమాచారం.

మే 18న సురేష్ తన స్వస్థలానికి వెళ్లి మృతదేహానికి సంబంధించిన ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించి వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అలాగే సీఐ నాగరాజు ఆదేశాలతోనే సాయికృష్ణ కస్టడీలో ఉన్న సమయంలో తీసిన ఫొటోలను డిలీట్ చేసినట్లు సురేష్ చెప్పినట్లు సిట్ పేర్కొంది. సీఐ నాగరాజుతో సురేష్‌కు 2010 నుంచి పరిచయం ఉందని, ఆయనతో కలిసి నైట్ రౌండ్స్‌కు కూడా వెళ్లేవాడని దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

ఇదే కేసులో హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని సాయికృష్ణ బంధువులను నిందితులు బెదిరించడంతో పాటు, ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్లు కూడా సిట్ దర్యాప్తులో వెల్లడైనట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్‌ను సురేష్ సంప్రదించి రాజకీయ ప్రయత్నాలు చేసినట్లు, మే 31న కొలనుకొండ గ్రామంలోని మోడల్ డెయిరీ వద్ద నవరంగ్‌ను కలిసి పరిహారంపై మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఆ ప్రతిపాదనను నవరంగ్ తిరస్కరించినట్లు సమాచారం.

కేసు నమోదు, ఏ1 అరెస్టు అనంతరం సురేష్, ఏ2, ఏ3 కలిసి విజయవాడ నుంచి హైదరాబాద్, అక్కడి నుంచి నాగ్‌పూర్ వెళ్లినట్లు సిట్ దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్నారు. పోలీసులు తన ఆచూకీని గుర్తించకుండా ఉండేందుకు మొబైల్ ఫోన్‌ను మార్గమధ్యంలో కాలువలో పడేసినట్లు సురేష్ వెల్లడించినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. సెప్టెంబర్ 18న సురేష్‌ను రాణిగారితోటలోని పాత భవనం వద్దకు తీసుకెళ్లగా, సాయికృష్ణను ఉంచిన ప్రదేశాన్ని అతడు గుర్తించినట్లు సిట్ తెలిపింది. అనంతరం స్వర్గపురి శ్మశానవాటికలో మృతదేహాన్ని దహనం చేసిన ప్రదేశాన్ని కూడా సురేష్ గుర్తించినట్లు పేర్కొంది. అతడు ఇచ్చిన సమాచారంతో రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సురేష్ వెల్లడించిన వివరాలను కాల్ డేటా రికార్డులు, సాంకేతిక విశ్లేషణ, సంబంధిత సమయంలో ఏ1, ఏ2, ఏ4 మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మోడల్ డెయిరీ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలతో సరిపోల్చుతూ సిట్ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సాయికృష్ణను పోలీస్ స్టేషన్‌లోనే కొట్టి చంపారనే అభిప్రాయం ఉండగా, తాజాగా రిమాండ్ రిపోర్టులో రాణిగారితోటలోని పాడుబడిన భవనంలో ఆయన మృతి చెందినట్లు పేర్కొనడం కేసులో కీలక పరిణామంగా మారింది. అయితే ఈ అంశాలన్నీ దర్యాప్తు, రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న విషయాల ఆధారంగానే ఉన్నాయని, కేసు తుది నిర్ధారణ న్యాయ ప్రక్రియలోనే జరగాల్సి ఉంటుంది.

**సురేష్‌కు రిమాండ్ :** సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో మూడు నెలలుగా పరారీలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏ4 గులివిందల సురేష్‌ను సిట్ అధికారులు అరెస్టు చేసి శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ కావడంతో సిట్ ఎదుట లొంగిపోయిన సురేష్‌ను అరెస్టు చేసి విచారించిన అనంతరం 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్షులను ప్రభావితం చేయకుండా నిందితుడికి రిమాండ్ విధించాలని సిట్ కోరగా, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శ్రీకాంత్ సెప్టెంబర్ 24 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సురేష్‌ను నూజివీడు జైలుకు తరలించారు.

## ఫార్మర్ ఐడి ఉండాలి



**బాపట్ల బ్యూరో (ఎస్ఏపిఎన్) :** బాపట్ల జిల్లా యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామములో కంచర్ల యేసయ్య మరియు మణికంఠ అనే రైతులు సాగుచేసిన ప్రత్తి పొలాలను జిల్లా వ్యవసాయాధికారిణి ఎ.లక్ష్మి శుక్రవారం సందర్శించి పరిశీలించి రైతులతో చర్చించారు . తీవ్ర వర్షాభావం ప్రభావం వలన పైరులో ఎదుగుదల లేదని, దిగుబడి గణనీయంగా తగ్గుతాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ- పంటలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు తెలిపారు. అలాగే భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ ఐడి పొందాలని కోరారు. పి యం కిసాన్ పెట్టుబడి సహాయం పొందాలన్నా, పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, రాబోయే రోజులలో ఎరువులు కొనుగోలు చేయాలన్నా ఫార్మర్ ఐడి తప్పనిసరి అన్నారు. పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ పంటలు సాగు చేయబోయే రైతులకు అవసంమైన ఎరువులను రైతు సేవాకేంద్రాలలో అందుబాటులో ఉంచామని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎ. పి ఎ. ఐ. యం. యస్ యాప్ ద్వారా కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. జిల్లా అధికారులుతో పాటు యద్దనపూడి మండల వ్యవసాయాధికారి కుమారి, వి.ఎ.ఎ జిలాన్ రైతులు పాల్గొన్నారు.

## ఏపీకి బిగ్ అలర్ట్.. భారీ వర్ష సూచన

**విశాఖపట్నం:** ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సాయంత్రానికి ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడనుంది. పశ్చిమ వాయువ్య దిశలో కదులుతూ అల్పపీడనం మరింత బలపడుతుందని వాతావరణ శాఖ అంచనా. ఈ నెల 23, 24వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండం లేదా తుపానుగా ఉత్తర కోస్తా-దక్షిణ ఒడిస్సా మధ్య తీరం దాటే అవకాశం.. ఉందని పేర్కొంది. ఇప్పటికే ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ పలు కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రేపటి నుంచి వర్షాలు మరింత పుంజుకోనున్నాయి. నిన్న(శుక్రవారం) ఎండ తీవ్రతతో పాటు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో 5, అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో 4.8, కృష్ణాపురంలో 4.6, పెదబొడ్డేపల్లెలో 4.1, విజయనగరం జిల్లా కొత్తవలసలో 3.9, కాకినాడ జిల్లా రౌతులపూడిలో 2.1 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

## లిక్కర్ కేసులో సిట్ 3 రూపాయలు కూడా పట్టుకోలేదు : పేర్ని నాని

**తాడేపల్లి:** చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కరవు తాండవిస్తోందని తెలిపారు. లిక్కర్ కేసులో సిట్ 3 రూపాయలు కూడా పట్టుకోలేదని అన్నారు. లిక్కర్ కేసులో సిట్ దర్యాప్తు టీవీ సీరియల్‌లా సాగుతోందని చెప్పారు. చంద్రబాబు కీలుబొమ్మ అయిన సిట్ ఒక్క రూపాయి కూడా పట్టుకోలేదని అన్నారు. లిక్కర్ కేసులో సిట్ దర్యాప్తు సక్రమంగా జరగడం లేదని తెలిపారు. చంద్రబాబు చెప్పినట్లు సిట్ దర్యాప్తు జరుగుతోంది. లడ్డూ ప??రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. టీటీడీ శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చెప్పిందని అన్నారు.

## న్యాయం చేసిన వారిని గెలిపించండి

**విజయనగరం :** ప్రజలకి, రైతులకి న్యాయం చేసిన వారు ఎవరో తెలుసుకుని వారికే మద్దతుగా నిలవాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రీ సర్వే పేరిట రైతులందరినీ తమ భూములకి తమనే యజమానులు కాకుండా చేశారన్నారు. కాని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితులన్నింటినీ సరిచేసిందన్నారు. భీమిసింగి వద్ద రైతులకి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో రూపుది ద్దుకున్న భూ సర్వే రికార్డులన్నింటినీ మార్చేశారని అన్నారు. అన్నింటిలోనూ వారి ప్రచారానికి రైతులను బలితీసుకున్నారన్నారు. ఆ పరిస్థితులన్నింటినీ సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితోపనిచేసిందన్నారు. దీంతో ఏళ్ల తరబడి వివాదాస్పదంగా ఉన్న వాటిని ఈ సర్వే ద్వారా పరిష్కరించడం జరిగిందన్నారు. భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ గురించి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. శాసనపల్లి, పెద వేమిలి మధ్య బ్రిడ్జీ నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామం అభివృద్ధి కోసం 95 కోట్ల రూపాయలను ప్రత్యేక నిధులు తీసుకుని వచ్చానన్నారు. త్వరలో ఇంటింటి కుళాయి పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న కూటమిని గెలిపించేందుకు గ్రామస్థులు కట్టుదిట్టంగా పనిచేయాలన్నారు.

## భీమిలి సమన్వయకర్తగా బొత్స అనూష

**అమరావతి:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్తగా బొత్స అనూషను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో నియామకాలు :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కమిటీలో వివిధ హోదాల్లో నియామకాలు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన పైలా సన్యాసిరాజును స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) మెంబర్‌గా నియమించారు. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గానికి చెందిన వెంపడ శ్రీనివాసరెడ్డిని స్టేట్ సెక్రటరీ(పార్లమెంట్)గా నియమించారు.

## కొండపైకి నడిచి వెళ్లి క్షమాపణ చెప్పాల్సిందే

**తాడేపల్లి:** సనాతన ధర్మ పరిరక్షకులమని గొప్పలు చెప్పుకునే కూటమి పార్టీల నేతలు, కనీసం హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఆదిదేవుడు వినాయకుడి విగ్రహాల నిమజ్జనానికి నీళ్లు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉన్నారని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పలుచోట్ల నిమజ్జనానికి నీళ్లు లేక విగ్రహాలను ఎండిన కాలువలు, వాగుల్లో అలానే వదిలిపెడుతున్న హృదయ విదారక దృశ్యాలు చూస్తే ప్రతి హిందువు హృదయం కలుక్కుమంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతల హిందుత్వం ఇప్పుడు ఎక్కడికి పోయిందని, కనీసం నిమజ్జనానికి నీళ్లు కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. మరోవైపు, కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారి అత్యంత పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలిసిందంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అత్యంత నిస్సిగ్గుగా మాట్లాడిన పచ్చి అబద్ధాలన్నీ సుప్రీంకోర్టు ఆదేశాలతో నడుస్తున్న సిట్ నివేదిక ద్వారా తేలిపోయాయని స్పష్టం చేశారు. ఇప్పుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, వారికి వత్తాసు పలికిన ఎల్లో మీడియా తమ ముఖాలను ఎక్కడ పెట్టుకుంటారని నిలదీశారు. చేసిన మహా పాపానికి వెంకటేశ్వరస్వామి వారికి, భక్తులకు కచ్చితంగా క్షమాపణ చెప్పి తీరాలని, లేనిపక్షంలో ఆ ఏడుకొండలవాడి శాస్తి తప్పదని వెల్లంపల్లి తీవ్రంగా హెచ్చరించారు.

వినాయక చవితి అనేది పసిపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి హిందువు అత్యంత పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునే అతిపెద్ద పండుగ. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భక్తులు మండపాలు వేసి పూజలు చేసుకుంటే, కనీస ఏర్పాట్లు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం హిందువుల మనోభావాలను దారుణంగా దెబ్బతీసింది. వెన్నుపోటు పాలనలో ఆదిదేవుడైన గణనాథుడికి కూడా తీరని అపచారం జరుగుతోంది.

అనంతపురం జిల్లా బుక్కరాయి సముద్రం వద్ద హెచ్‌ఎల్సీ కాలువలో నీరు లేక, ఎల్లనూరు ప్రాంతంలో చిత్రావతి పరిసరాల్లో నీటి కొరత వల్ల పూజలు అందుకున్న విగ్రహాలను మట్టిలో, ఎండిన కాలువల్లో వదిలేయాల్సిన దారుణ పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వానికి, అధికారులకు ముందే తెలుసు. అటువంటప్పుడు నిమజ్జనం కోసం ప్రత్యామ్నాయంగా చిన్న చిన్న కుంటలు, కాలువలు ఎందుకు తవ్వించలేదు?. నిమజ్జనానికి నీళ్లు వదలాలనే కనీస జ్ఞానం చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికి లేదా?.

# గ్రూపులు వీడండి.. ఐక్యంగా పనిచేయండి



- ఇచ్ఛాపురం వైసీపీ నేతలకు ధర్మాన దిశా నిర్ధేశం
- పార్టీకి నష్టం చేస్తే సహించేది లేదని హెచ్చరిక
- ఎవరు ఏమి చేస్తున్నారో అంతా తెలుసన్న ధర్మాన
- నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఫైర్ అయిన ప్రసాదరావు
- టిక్కెట్ ఎవ్వరికి వచ్చినా గెలుపుకోసం అంతా పనిచేయాల్సిందేనని స్పష్టీకరణ

**సోంపేట :** ఇచ్ఛాపురం వైసీపీలో చాలాకాలంగా సాగుతున్న గ్రూపుల గోల, నాయకుల మధ్య విభేదాలు, ఎన్నికల సమయంలో ఒకరికి ఒకరు సహకరించని వ్యవహారంపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గట్టిగా స్పందించారు. ఇంతకాలం నేతల మధ్య అంతర్గతంగా సాగుతున్న విభేదాలను బహిరంగ వేదికపైనే ప్రస్తావిస్తూ పార్టీని ఓడిస్తున్నది ప్రత్యర్థులు కాదని.. పార్టీలోని అనైక్యతేనని పేర్కొన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే నేతలను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు చేశారు. 'గతంలో ఎవరు ఏం చేశారో నాకు తెలుసు.. అందరి చిట్టా నా దగ్గరుంది.. గతం పునరావృతమైతే పరిస్థితి మరోలా ఉంటుంది' అంటూ ఘాటు ప్రసాదరావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంలో భాగంగా సోంపేట పట్టణంలో శుక్రవారం ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, వార్డు స్థాయి నుంచి మున్సిపాలిటీ వరకు వైసీపీ జెండా ఎగరేయాలని ముఖ్యనేతలంతా దిశానిర్దేశం చేశారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన ప్రసంగం ఒక్కసారిగా రాజకీయ వేడి పెంచింది. సాధారణంగా ప్రభుత్వంపై విమర్శలు, ఎన్నికల వ్యూహాలకే పరిమితమయ్యే ప్రసంగాలకు భిన్నంగా.. ఆయన నియోజకవర్గంలోని పార్టీ అంతర్గత పరిస్థితులపై నేరుగా మాట్లాడారు. ఇచ్ఛాపురంలో పార్టీకి కార్యకర్తల బలం ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదని, దీనికి ప్రధాన కారణం నాయకుల మధ్య ఉన్న విభేదాలేనని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అన్న ప్రచారాన్ని కూడా ధర్మాన ప్రస్తావించారు. ఇది పూర్తిగా ప్రత్యర్థి పార్టీ బలం వల్ల ఏర్పడిన పరిస్థితి కాదని, వైసీపీ నాయకుల మధ్య అనైక్యతే ప్రత్యర్థులకు బలంగా మారుతోందన్న రీతిలో వ్యాఖ్యానించారు. పార్టీ బలంగా ఉన్నప్పటికీ నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎన్నికల్లో నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకరికి పార్టీ టికెట్ ఇస్తే మిగిలిన నాయకులు, వర్గాలు అభ్యర్థి విజయానికి పనిచేయడం లేదని ధర్మాన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరిని ఓడించేందుకు పనిచేసి, ఆ తర్వాత పార్టీ పెద్దల వద్దకు వచ్చి ఫిర్యాదులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వరుసగా పార్టీ ఓడుతున్నా నాయకుల్లో మార్పు రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతంలో పార్టీకి ఎవరు ఏ విధంగా పనిచేశారు.. ఎవరు ఎలా వ్యవహరించారు.. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగింది అనే విషయాలన్నీ తనకు తెలుసని ధర్మాన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరి చరిత్ర తనకు తెలుసని, అందరి చిట్టా తన దగ్గర ఉందని హెచ్చరించారు. గతంలో జరిగిన వ్యవహారాలు మళ్లీ పునరావృతమైతే పరిస్థితి మరోలా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్న సంకేతాన్ని ఆయన ఇచ్చారు. పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం సరికాదని, పార్టీ అభ్యర్థిని ఓడించి మళ్లీ అదే పార్టీ నాయకత్వం వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. పార్టీ కోసం పనిచేయని నాయకులు ఎన్నికల సమయంలోనే తమ బాధ్యతను గుర్తుచేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ విజయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్న రీతిలో ఆయన వ్యాఖ్యలు చేశారు.

సామాజిక సమీకరణాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని కూడా ధర్మాన ప్రస్తావించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించారని, కాళింగ సామాజిక వర్గానికి చెందిన విజయమ్మకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. మరో కీలక సామాజిక వర్గానికి చెందిన శ్యాంప్రసాద్‌రెడ్డికి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. పార్టీ అన్ని వర్గాలకు అవకాశాలు కల్పిస్తున్నప్పుడు ఇంకా ఏం కావాలని ప్రశ్నించారు. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటోందని, ఇప్పుడు అందరూ పార్టీ విజయానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు.

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి విషయంలో కూడా ధర్మాన ప్రసాదరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కొంతకాలంగా ప్రచారంలో ఉన్న పేర్లపై ఆయన స్పష్టత ఇచ్చారు. మాజీ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఉలాల భారతి దివ్య, ఉలాల కోదండరాం పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. అయితే తుది నిర్ణయం త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని స్పష్టం చేశారు. పేర్లు ఎన్ని ఉన్నా అవకాశం మాత్రం ఒక్కరికే వస్తుందని, మిగిలిన వారు పార్టీ నిర్ణయానికి కట్టుబడి అభ్యర్థి విజయానికి పనిచేయాలని సూచించారు.చైర్మన్ అభ్యర్థిత్వం కోసం నాయకుల మధ్య పోటీ ఉండటం సహజమేనని, అయితే ఆ పోటీ పార్టీకి నష్టం చేసే స్థాయికి వెళ్లకూడదని ధర్మాన సూచించారు. పార్టీ నిర్ణయం వెలువడిన తర్వాత వ్యక్తిగత వర్గాలు, గ్రూపులు పక్కనపెట్టి పార్టీ అభ్యర్థి కోసం పనిచేయాలని స్పష్టం చేశారు. ఎవరికైనా పదవి దక్కకపోతే పార్టీకి దూరమవడం లేదా పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం వల్ల చివరకు నష్టపోయేది పార్టీతో పాటు ఆ నాయకులేనని హెచ్చరించారు.

ఈసారి ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వైసీపీ జెండా ఎగరాలని ధర్మాన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ మొదటగా గెలిచే మున్సిపాలిటీల్లో ఇచ్ఛాపురం ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల్లో విజయం సాధిస్తే నియోజకవర్గంలోని కార్యకర్తలకు రాజకీయంగా గౌరవం పెరుగుతుందని, పార్టీకి ప్రజాప్రతినిధి ఉంటే కార్యకర్తలు సగర్వంగా కాలర్ ఎగరేసుకునే అవకాశం వస్తుందని అన్నారు.ఇచ్ఛాపురంలో పార్టీ ఓడిపోయినా పార్టీ రాష్ట్రస్థాయి భవిష్యత్తుకు పెద్దగా నష్టం ఉండదని, అయితే స్థానికంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలే ప్రజల్లో చులకన అవుతారని ధర్మాన పేర్కొన్నారు. అందువల్ల ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్కచోట ఓడిపోయినంత మాత్రాన రాష్ట్ర రాజకీయాల్లో వైసీపీకి భవిష్యత్తు లేదనే భావన అవసరం లేదని, భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు.

కార్యకర్తలు తప్పు చేసే నేతలను ప్రశ్నించాలని, పార్టీకి అన్యాయం చేసే వారిని మౌనంగా చూస్తూ ఉండకూడదని ధర్మాన పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలు బలమని, నాయకులు ఆ బలాన్ని విభేదాలతో దెబ్బతీయకూడదని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా నాయకుల మధ్య ఉన్న విభేదాలు తొలగాలని, అందరూ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సమావేశం ప్రారంభం నుంచి నేతలు స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసినా.. ధర్మాన ప్రసాదరావు ముగింపు ప్రసంగం మాత్రం పూర్తిగా పార్టీ అంతర్గత వ్యవహారాల చుట్టూ సాగింది. ప్రభుత్వాన్ని ఎదుర్కొనే ముందు పార్టీలోని గ్రూపుల సమస్యను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్న సందేశం ఆయన ప్రసంగంలో స్పష్టంగా కనిపించింది.

ఇప్పటివరకు గ్రూపుల గోల, నాయకుల మధ్య విభేదాలతో సతమతమవుతున్న ఇచ్ఛాపురం వైసీపీలో ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో కొత్త చర్చకు దారితీశాయి. పార్టీని ఓడించే అంతర్గత శక్తులపై ఇకపై కఠినంగా వ్యవహరించాలన్న సంకేతాలు ఈ సమావేశం ద్వారా వెళ్లాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా.. సోంపేట వేదికగా జరిగిన వైసీపీ విస్తృతస్థాయి సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంగా ప్రారంభమై.. చివరకు ఇచ్ఛాపురం వైసీపీలోని అంతర్గత విభేదాలు, గ్రూపుల వ్యవహారంపై ధర్మాన ప్రసాదరావు చేసిన ఘాటు వ్యాఖ్యలతో రాజకీయంగా వేడి రాజేసింది.




# కేంద్ర ఉద్యోగం.. గర్వం, గుర్తింపు




**విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే గర్వం, గుర్తింపుతో పాటు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం అని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఉద్యోగం సాధించిన తొలి రోజు జీవితంలో మరపురాని అనుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నం పోర్టు స్టేడియంలోని కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగాలు పొందిన 51 వేల మందికి ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో 200 మంది అభ్యర్థులకు రామ్మోహన్‌నాయుడు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారితో ముచ్చటించి ఉద్యోగ సాధన అనుభవాలను తెలుసుకున్నారు.**

### ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి

ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాది మంది యువత పోటీ పడుతున్నారని, ఇలాంటి పోటీ వాతావరణంలో ఉద్యోగం సాధించడం గొప్ప విజయమని మంత్రి అన్నారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్రను ఎప్పటికీ మర్చిపోకూడదని సూచించారు. ఉద్యోగం జీవితానికి, భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని.. అయితే ఉద్యోగం ద్వారా తాము ఏం సాధించామన్నదానికంటే తమ ద్వారా ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగిందన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం కలిగించేలా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.

### ఎదుగుదలకు అడ్డుకట్ట వేయొద్దు

ఉద్యోగం వచ్చిందనే సంతృప్తితో యువత తమ ఎదుగుదలను

### ప్రజలకు సేవ చేయడమే అసలైన సంతృప్తి: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



ఆపకూడదని రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలని సూచించారు. సీనియర్లతో సమన్వయం చేసుకుంటూ వ్యవస్థలోని లోటు పాట్లను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

### భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి

ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని మంత్రి అన్నారు. దేశ ప్రతిష్ఠను మరింత పెంచే బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంకితభావం, నిరంతర శ్రమను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా కాలానుగుణంగా మారుతూ భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఐటీ విప్లవం నుంచి ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ టెక్నాలజీ వరకు భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యువత కూడా భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసుకుని నైపుణ్యాలను పెంచుకుంటూ ముందుకు సాగాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, సీబీఐసీ చీఫ్ కమిషనర్ ఎన్.శ్రీధర్, ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ దండా శ్రీనివాస్, ప్రిన్సిపల్ కమిషనర్ కేవీవీజీ దివాకర్, ఎల్‌వీవీఎస్ పాత్రుడు, అడిషనల్ కమిషనర్ ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఇక 'బొత్స 2.0' చూస్తారు: అనూష



**అమరావతి:** మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికల్లో చీపురుపల్లి నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. 'గౌరవంగా ఉన్న ఏ కుటుంబమూ టీడీపీలోకి వెళ్లలేదని, లాలూచీ రాజకీయాలు కాకుండా గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. నేను మంత్రే అయితే.. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ మంత్రే అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు వస్తాయని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ కుమార్తె, వైఎస్సార్‌సీపీ నేత బొత్స అనూష మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చిన్న శీనుపై బొత్స అనూష కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి రోజు మీరు చిన్న శీను అపాయిట్మెంట్ కోసం ఎదురు చూసేవారు. ఆ ఒకరు పోయారు. ఇప్పుడు మీకు ఇద్దరు వచ్చారు. నేను తమ్ముడు ఉన్నాం. నాన్న ఉన్నారు. పార్టీ మారిన వారికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలి. ఇప్పటివరకు అందరూ బొత్స 1.0 చూశారు.. ఇక నుంచి బొత్స 2.0 చూస్తారు. చీపురుపల్లి కార్యకర్తల వల్లే మా నాన్నకు ఈ బ్రాండ్ వచ్చింది అని అన్నారు. గ్రామాల్లో ఏకగ్రీవాలు జరగకూడదని వైఎస్ జగన్ చెప్పారని, ఆయన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## చంద్రబాబుకు జలీల్ ఖాన్ అల్టిమేటం

**విజయవాడ:** ముస్లింల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జలీల్‌ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు కేవలం చిన్న చిన్న నామినేటెడ్ పోస్టులతో మాత్రమే సరిపెడుతున్నారన్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే చంద్రబాబుకు జలీల్‌ఖాన్ అల్టిమేటం జారీ చేశారు. ఈసారి కచ్చితంగా విజయవాడ మేయర్ సీటు ముస్లింలకే ఇవ్వాలన్నారు. 'విజయవాడ మేయర్‌గా మైనార్టీలకు అవకాశం కల్పించాలి. మేయర్ సీటు మహిళలకు రిజర్వ్ అయితే నా కుమార్తెకు అవకాశం ఇవ్వాలి. బీజేపీ మైనార్టీల ఇంపార్టెన్స్ ను గుర్తించింది. కానీ చంద్రబాబు వైఖరి నాకు నచ్చడం లేదు. అనుభవం ఉండి కూడా చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు సరికాదు. విజయవాడలో పార్టీ గెలవాలన్నా...పార్టీ క్యాండెట్ గెలవాలన్నా మైనార్టీల సహకారం అవసరం. ముస్లింలకు మేయర్‌గా అవకాశం ఇస్తే పోటీ ఉండదు. నాకు ఊహతెలిసినంత వరకూ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే టిక్కెట్ ముస్లింలకే ఇచ్చేవారు. మొన్నటి ఎన్నికల్లో జిల్లాలోనే ముస్లింలకు ఎమ్మెల్యే సీటు లేకుండా చేశారు. ఆ రోజే నాకు బాధ కలిగినా నాలోనే దాచుకున్నా. ముస్లింలకు ఎమ్మెల్సీ ఇవ్వడం లేదు ...రాజ్యసభ సభ్యుడు ఇవ్వడం లేదు. చిన్న చిన్న నామినేటెడ్ పదవులతో సరిపెట్టేస్తున్నారు. 2019లో నా కుమార్తెను కోరి తెచ్చుకున్నారు. ఇండిపెండెంట్‌ను బరిలోకి దించి నా కుమార్తెను ఓడించారు. నా కుమార్తె ఓటమిలో కూడా కుట్ర జరిగిందికానీ నేను పేర్లు చెప్పలేదు ... చెప్పినా ఉపయోగం ఉండదని చెప్పలేదు. టీడీపీలోయాక్షన్ ఉండదరు..రియాక్షన్ అసలే ఉండదు' అని మండిపడ్డారు.

## మోహినీ రూపంలో భక్తులను కటాక్షించిన శ్రీ మలయప్పస్వామి



**తిరుమల:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై జగన్మోహనాకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై భక్తులకు అభయమిచ్చారు. గజరాజులు ముందుగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళారూపాలు..** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భారతీయ కళా వైభవం వెల్లివిరిసింది. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన కళాబృందాలతోపాటు టీటీడీకి చెందిన వివిధ కళా ప్రాజెక్టులు, సంస్థల కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం 18 కళాబృందాలకు చెందిన 502 మంది కళాకారులు 18 కళారూపాలను ప్రదర్శించారు. భరతనాట్యం, కూచిపూడి, సత్రియ, ఒడిస్సీ, భాంగ్రా, కోలాటం, పేరిణి శివతాండవం, మయూర నృత్యం, డమరుక ధ్వని విన్యాసం, అన్నమయ్య జానపదాలు తదితర ప్రదర్శనలు భక్తులను అలరించాయి.






# శివాని విద్యార్థులకు యూకే బాట!

**StudyTrek చొరవతో శివాని ఇంజినీరింగ్ కళాశాల - University of South Wales మధ్య MoU**

**ఎచ్చెర్ల:** చిలకపాలెంలోని శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్) మరియు యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ సౌత్ వేల్స్ (USW) మధ్య అంతర్జాతీయ విద్యా సహకారానికి సంబంధించి అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. ఈ ప్రతిష్ఠాత్మక విద్యా భాగస్వామ్యాన్ని విశాఖపట్నంలోని StudyTrek Private Limited లియాజన్ చేసి, రెండు సంస్థల మధ్య విద్యా సహకారానికి వారధిగా నిలిచింది.

ఈ MoU ద్వారా శివాని విద్యార్థులకు యూకేలో బీటెక్ చివరి సంవత్సరం పూర్తి చేయడం, మాస్టర్స్ చదవడం, అంతర్జాతీయ అకడమిక్ అనుభవం, స్కాలర్‌షిప్‌లు వంటి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. మాస్టర్స్ విద్యార్థులకు £4,000 వరకు, డైరెక్ట్ పీజీ అడ్మిషన్ పొందే విద్యార్థులకు £3,300 వరకు స్కాలర్‌షిప్ అవకాశాలు ఉన్నట్లు కళాశాల వర్గాలు తెలిపాయి.




కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ MoU విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని తెలిపారు. ప్రపంచస్థాయి విద్య, అంతర్జాతీయ అనుభవం, స్కాలర్‌షిప్‌లు మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ సౌత్ వేల్స్ - ఇండియా రీజినల్ డైరెక్టర్ రమేష్ పతి ఈ విద్యా సహకారాన్ని ధ్రువీకరించారు.

కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాస్, దుప్పల వెంకటరావు, డాక్టర్ సనపల శ్రీనివాసరావు, జె. హరీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి. చంద్రశేఖర్, StudyTrek డైరెక్టర్ డాక్టర్ రవి గునుపూరు, Mallikarjuna Prasad, బి.వి. విశ్వనాధం, StudyTrek శ్రీకాకుళం-ఒడిశా రీజియన్ ప్రతినిధులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. శివాని విద్యార్థులకు యూకే విద్యా అవకాశాలను చేరువ చేస్తూ, అంతర్జాతీయ ఉన్నత విద్య వైపు కొత్త మార్గాన్ని StudyTrek ఈ MoU ద్వారా ప్రారంభించింది.

**విద్యార్థులకు StudyTrek ప్రత్యేక అవగాహన**




ఈ సందర్భంగా StudyTrek డైరెక్టర్ డాక్టర్ రవి గునుపూరు, శ్రీ మల్లికార్జున ప్రసాద్, శ్రీ విశ్వనాథ శర్మ విద్యార్థులు, అధ్యాపకులు మరియు యాజమాన్యంతో ప్రత్యేకంగా సమావేశమై విదేశీ ఉన్నత విద్యా అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ అవకాశాలు మరియు విద్యార్థులకు StudyTrek అందించే మార్గదర్శకత్వంపై అవగాహన కల్పించారు.

అదేవిధంగా డిప్లొమా విద్యార్థుల కోసం జర్మనీలోని Ausbildung కార్యక్రమం గురించి కూడా వివరించారు. చదువుతో పాటు ప్రాక్టికల్ శిక్షణ, పని అనుభవం మరియు ఆదాయ అవకాశాలను కల్పించే ఈ విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హతలు, భాషా నైపుణ్యాలు మరియు సంబంధిత ప్రోగ్రామ్ నిబంధనలకు అనుగుణంగా అవకాశాలు ఉంటాయని వివరించారు.

MoUలో భాగంగా USW ప్రొఫెసర్లతో వెబినార్లు, అకడమిక్ సెషన్లు, Global Immersion Programme, ఫ్యాకల్టీ క్యాంపస్ సందర్శనలు, వర్చువల్ ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.




## టీటీడీ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదు



**తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తేల్చేసింది. జంతు కొవ్వు కలిసిందనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ విషయంపై దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2019 నుంచి 2024 మధ్య టీటీడీకి సరఫరా అయిన నెయ్యికి సంబంధించి అన్ని విధాలా విచారించింది. ఏ దశలో కూడా జంతువుల కొవ్వు కలిపారనే దానికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లేవని గుర్తించింది.

తద్వారా సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఇతర కూటమి నేతలు పనిగట్టుకుని దు?రప్పచారం చేసినట్లు తేటతెల్లమైంది. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు.. భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయన్న ఆలోచన లేకుండా, కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దారుణంగా ఆరోపణలు చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు వాడారని నిరాధారంగా ప్రకటించి కలకలం రేపారు.

చంద్రబాబు సీఎం అయ్యాకే.. తిరుమలకు వచ్చిన నెయ్యి ట్యాంకర్లలో నాణ్యత లేదని కొన్నింటిని వెనక్కు పంపడం, ఆ నెయ్యి అసలే వాడక పోయినా.. వాడారంటూ అబద్ధం చెప్పడం.. దానిపై ఎల్లో మీడియా వరుస కథనాలు వెలువరించడం.. సుప్రీంకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం.. సీబీఐ సిట్ కూడా దర్యాప్తు చేసి, జంతుకొవ్వు కలవలేదని నివేదిక ఇవ్వడం తెలిసిందే. ఈ క్రమంలో ఇదే విషయమై తిరుపతిలో నమోదైన కేసుపై ఈడీ కూడా దర్యాప్తు చేపట్టింది. పలు సంస్థలను, పలువురిని విచారించి.. ఎట్టకేలకు తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని నిర్ధారించింది.

చంద్రబాబు కేవలం తన కుటుంబానికి చెందిన హెరిటేజ్ భాగస్వామ్య సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా తప్పుడు ఆరోపణలు, దు?రప్పచారం చేశారని ఇదివరకే స్పష్టమైంది. ఇప్పుడు ఈడీ కూడా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చడంతో ఇదంతా చంద్రబాబు డైవర్షన్ డ్రామా అని మరోమారు స్పష్టమైందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. హామీలు నెరవేర్చలేని తరుణంలో ఎప్పటికప్పుడు డైవర్షన్ డ్రామాలకు తెర లేపడం చంద్రబాబుకు అలవాటేనని, ఆ పరంపరలోనే శ్రీవారి లడ్డూపై కూడా ఆరోపణలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తీశారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పేదలకు పట్టాభిషేకం.. ఆస్తి హక్కు పత్రాలను పంపిణీ చేసిన చంద్రబాబు

**విశాఖపట్నం:** పేదలకు సొంతిల్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొని.. పేదలకు ఆస్తి హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ.. పేదల ముఖాల్లో ఆనందం చూస్తున్నానని.. ఇవాళ తన జీవితం ధన్యమైందని అన్నారు.

""పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నాం. 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. దశాబ్దాల కష్టాలు, అనిశ్చితికి నేటితో ముగింపు పలుకుతున్నాం. అభ్యంతరం లేని భూముల్లో పట్టాలు ఇస్తున్నాం. మీరు ఉండే ఇళ్లపై ఇకనుంచి సర్వహక్కులు మీవే. వీటిపై బ్యాంకు రుణాలు కూడా తీసుకోవచ్చు. ఇంకా 35 కాలనీల్లోని 10 వేలమంది పట్టాలు కోరుతున్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు ఇవ్వాలి. మిగతావారికి త్వరగా పట్టాలు ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా. పేదలకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత మా ప్రభుత్వానిది.

విశాఖ త్వరలో విశ్వనగరంగా మారుతుంది. అల్లూరి విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. ఈ



నగరం టూరిజం, లాజిస్టిక్స్‌కు హబ్‌గా మారనుంది. పోలవరం ఎడమ కాలువ త్వరలో విశాఖకు వస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## డీఎస్సీ అతి పెద్ద కుంభకోణం




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన మెగా డీఎస్సీ--2025లో ప్రతిభకు పాతరేసి అతి పెద్ద కుంభకోణంగా మార్చేశారని ఐఏఎస్ మాజీ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ పాలనలో జరిగిన డీఎస్సీ అక్రమాలపై చర్చించేందుకు విజయవాడలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్‌తో పాటు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ విద్యార్థి, నిరుద్యోగ యువజన జేఏసీ కన్వీనర్ ఎంబేటి రామచంద్ర, డీఎస్సీలో నష్టపోయిన మెరిట్ అభ్యర్థులు పాల్గొని మాట్లాడారు.

**కుంభకోణానికి ఇదే నిదర్శనం..** విజయ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లు స్పోర్ట్సు కోటా కోసం రెండు జీవోలు తెచ్చి, వారి పని పూర్తి అయ్యాక వాటిని మార్చేశారని, డీఎస్సీలో కుంభకోణం జరిగిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రశ్నపత్రం తయారు చేసే చోట పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎప్పుడూ రానన్ని అత్యధిక మార్కులు వచ్చాయని, దేశంలో ఏ డీఎస్సీలో కూడా ఇలా జరగలేదన్నారు. ఇంత పెద్ద కుంభకోణానికి పాల్పడ్డ విద్యాశాఖ మంత్రి లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, న్యాయమూర్తి పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**బాధితులకు సమాధానం చెప్పండి :** మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలు ప్రజలకు తెలియజేస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. డీఎస్సీలో ఎలా మోసం జరిగిందో అభ్యర్థులే చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, బాధ్యత గల వారైతే వెంటనే సీబీఐ విచారణ చేయించాలన్నారు. లోకేశ్‌కు చేతనైతే బాధిత అభ్యర్థుల ముందు సమాధానం చెప్పాలన్నారు. మంత్రిగా ఉండేందుకు లోకేశ్ అర్హుడు కాదని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన వచ్చిన ఉద్యోగాలపై విచారణ జరపాల్సిందేన్నారు.

**వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదు :** మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఎదురుదాడి చేస్తున్నారే తప్ప ప్రభుత్వం నోరు విప్పడం లేదన్నారు. వెటర్నరీ పోస్టులను కూడా అమ్ముకుందామని చూసి, చివరకు వాటి నిర్వహణ బాధ్యతను ఏపీపీఎస్సీకి ఇచ్చారంటేనే లోపాలున్నాయని అర్థమవుతోందన్నారు.

డీఎస్సీతో పాటు తమ ప్రభుత్వం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షలపై కూడా సీబీఐ విచారణ చేయాలని జగన్ కోరారని, ఆ ఛాలెంజ్‌ను తీసుకునే దమ్ము ధైర్యం వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

# బిరుదు గొప్ప.. బిందె ఖాళీ

- వాటర్‌మ్యాన్ పాలన.. నీళ్ల కోసం ప్రజల రోదన
- తాగునీటి కోసం ప్రజల ఆందోళనలు
- వేసవిని మించి నీటి కొరత
- పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా పాలన



అమరావతి: ఒకవైపు జాతీయ మీడియా నుంచి 'వాటర్‌మ్యాన్' బిరుదు.. మరోవైపు అదే పాలనలో గుక్కెడు తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కుతున్న దృశ్యాలు. ఒకవైపు కేబినెట్ సమావేశంలో 'వాటర్‌మ్యాన్ వస్తున్నారహో.. లేచి నిలబడండి' అంటూ మంత్రులు గౌరవించడం.. మరోవైపు క్షేత్రస్థాయిలో ఖాళీ బిందెలతో ప్రజలు నిరసనలకు దిగడం. ఈ రెండు దృశ్యాల మధ్య ఉన్న వైరుధ్యమే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తాగునీటి పరిస్థితిపై చర్చకు దారితీస్తోంది. గౌరవించడం తప్పు కాదు.. ఒక నాయకుడికి లభించిన ప్రశంసను ఎవరూ తప్పుపట్టాల్సిన అవసరం లేదు. కానీ ఆ ప్రశంసలకు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులకు పొంతన ఉందా? అన్నదే అసలు ప్రశ్నగా మారుతోంది. ఇటీవల ఐఏఎస్ అధికారులను సైతం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లేచి నిలబెట్టి చంద్రబాబును గౌరవించిన ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే ఇదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి తాగునీటి కోసం ఆందోళనలు చేపట్టడం ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిస్థితిని సూచిస్తోంది.

## వానాకాలంలోనూ బిందెలే ఆయుధాలు!

సాధారణంగా వేసవిలో తాగునీటి ఎద్దడితో ప్రజలు రోడ్లపైకి రావడం చూస్తుంటాం. కానీ ఇప్పుడు వర్షాకాలంలోనే తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలు చేతబట్టి ఆందోళనలు చేయడం ఆందోళన కలిగించే పరిణామం. 'వాటర్‌మ్యాన్' పాలనలోనే నీటి కోసం జనం రోడ్డెక్కడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం శివారు ప్రాంతాలైన గాజువాక, మధురవాడ, పెందుర్తి, భీమిలి తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరానికి నీరందించే ప్రధాన వనరులైన ఏలేరు కాలువ, తాటిపూడి, మేఘాద్రిగడ్డ, గంభీరంగడ్డ తదితర రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న పరిస్థితి కూడా ఆందోళనకు కారణమవుతోంది. ఏలేరు కాలువ నుంచి నీటి సరఫరా తగ్గడం, జీవీఎంసీ ట్యాంకర్లు సక్రమంగా అందకపోవడంతో ఎంవీవీ సిటీ, ఎండాడ పరిసర ప్రాంతాల ప్రజలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేపట్టారు. రెండు మూడు రోజులకు ఒకసారి కూడా నీరు రావడం లేదని, వచ్చినా రెండు గంటలకే పరిమితమవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అనంతపురంలోనూ ఖాళీ బిందెలతో రాస్తారోకో



అనంతపురం జిల్లా గుడిబండ మండలంలోని నాగేపల్లి-కరికెర రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కరువు ప్రాంతంగా పేరున్న అనంతపురంలో తాగునీటి కోసం అప్పుడే ప్రజలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడప, కర్నూలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోనూ తాగునీటి సమస్యలపై ప్రజలు ఖాళీ బిందెలతో నిరసనలు చేపట్టిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు అందించాలని ప్రజలు పాలకులను కోరుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

## ఎల్‌నినోపై నెపం.. పరిష్కారం ఎక్కడ?



నీటి సమస్యకు ఎల్‌నినో ప్రభావం కూడా ఒక కారణమని ప్రభుత్వం చెబుతోంది. వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు వంటి అంశాలు సమస్యను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. అయితే ప్రజల ప్రశ్న మాత్రం సూటిగా ఉంది.. కారణాలు ఏవైనా కావచ్చు.. మరి పరిష్కారం ఏమిటి? ఒకవైపు 'వాటర్‌మ్యాన్' అంటూ ప్రశంసలు.. మరోవైపు నీటి కోసం బిందెలతో మహిళల నిరసనలు. ఈ రెండు చిత్రాలు ఇప్పుడు రాష్ట్ర పాలనపై భిన్నమైన కథను చెబుతున్నాయి.

## మళ్లీ సెంటిమెంట్ నిజమైనట్లేనా!

చంద్రబాబు పాలనలో కరువు వస్తుందనే ఒక రాజకీయ సెంటిమెంట్ గతంలో నుంచీ రాష్ట్ర రాజకీయాల్లో వినిపిస్తూ ఉంటుంది. దానిని వాస్తవంగా నిర్ధారించే ఆధారాలు లేవు. వర్షాలు, కరువు వంటి సహజ పరిస్థితులను నేరుగా ఒక వ్యక్తి పాలనకు ఆపాదించడం శాస్త్రీయంగా సమర్థనీయం కాదు. అయితే వరుసగా నీటి కొరత, పంటల సమస్యలు, తాగునీటి కోసం ప్రజల ఆందోళనలు చోటుచేసుకుంటే.. ఆ రాజకీయ ప్రచారానికి మాత్రం ప్రజల్లో చర్చకు అవకాశం ఏర్పడుతుంది. బిరుదులు, గౌరవాలు పాలకులకు ప్రతిష్ఠను తెచ్చిపెట్టవచ్చు.. కానీ ప్రజలకు మాత్రం కావాల్సింది బిరుదులు కాదు.. బిందె నిండా తాగునీరు. రానున్న రోజుల్లో తాగు, సాగునీటి అవసరాలను ప్రభుత్వం ఎలా తీర్చబోతుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

## జనవరి నెలాఖరులో జేఈఈ మెయిన్!




**న్యూఢిల్లీ:** 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. డిసెంబరు 2026 నుంచి మార్చి 2027 వరకు మొత్తం 14 జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్ 2027 తొలి విడత పరీక్షలు జనవరి 22 నుంచి 30 వరకు జరగనున్నాయి. యూజీసీ-నెట్ 2026 పరీక్షలను డిసెంబరు 14 నుంచి 19 వరకు నిర్వహించను న్నారు. సీయూఈటీ-పీజీ 2027 పరీక్షలు మార్చి 1 నుంచి 25 వరకు జరగనున్నట్లు NTA తెలిపింది.

అయితే ఇవి తాత్కాలిక తేదీలేనని, పరిపాలనా లేదా ఇతర కారణాల వల్ల పరీక్షల తేదీల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని చీూా స్పష్టం చేసింది. విద్యార్థులు తుది షెడ్యూల్, పరీక్షకు సంబంధించిన తాజా సమాచారాన్ని అధికారిక ప్రకటనల ద్వారా పరిశీలించాలని సూచించింది.

## ఘనంగాశ్రీ భగవాన్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు

- పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- కన్నులవిందుగా సాగిన కోలాట నృత్యం

**సత్తెనపల్లి (ఎస్ఎపీఎన్) :** స్థానిక పట్టణంలోని విశ్వకర్మ కమ్యూనిటీ హాల్ వద్ద శ్రీ భగవాన్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కోటగిరి పోతులూరయ్యాచారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విశ్వబ్రాహ్మణులతో కలసి ప్రత్యేక పూజలు, యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విశ్వకర్మ జయంతి వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ మస్తానమ్మ బృందం చేసిన కోలాట నృత్య ప్రదర్శన భక్తులను, పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులంతా ఏకతాటిపైకి వచ్చి యజ్ఞ మహోత్సవాన్ని ఇంతటి మహత్తరంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. సంఘ అధ్యక్షుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను చక్కగా నిర్వహించారని అభినందించారు. సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాలలో సమస్త జగత్తు నిర్మాణానికి మూలకారకుడైన విశ్వకర్మ భగవానుడి విశిష్టతను, దేవతల శిల్పిగా ఆయనకున్న ప్రాధాన్యతను కొనియాడారు. సమాజ వికాసంలో విశ్వకర్మ పంచవృత్తుల పాత్ర అత్యంత కీలకమైనదని ప్రస్తావించారు.

ఈ మహోత్సవంలో నియోజకవర్గ అధ్యక్షులు చింతాడ రమేష్, పట్టణ అధ్యక్షులు కోటగిరి పోతులూరయ్యాచారి, ఉపాధ్యక్షులు వానపాముల నాగ రత్నచారి, కోశాధికారి వంగిపురపు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దాసు భాస్కరాచారి, సహ కార్యదర్శి కోటగిరి గోపి పాల్గొన్నారు.



అలాగే సంఘ ప్రతినిధులు, సభ్యులు అత్తులూరి కోటేశ్వరరావు, తిపర్తి శంకర్ బాబు, మహంకాళి శ్రీనివాసాచారి, అద్దంకి శ్రీనివాసాచారి, కొణికి శివ బ్రహ్మానందం, మహంకాళి గోవిందాచారి, మహంకాళి మల్లేశ్వరాచారి, కల్లూరి నాగ బ్రహ్మాచారి, మహంకాళి గిరిధర్, మహంకాళి విజయ్ కుమార్ తదితర విశ్వబ్రాహ్మణ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగుల సమ్మె ఉధృతం




**నరసరావుపేట (ఎస్ఎపీఎన్):** తమ సుదీర్ఘకాల సేవలను గుర్తించి, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులు చేపట్టిన నిరసన ప్రదర్శన హోరెత్తింది. ఆంధ్రప్రదేశ్ జేఏసీ పిలుపు మేరకు, పల్నాడు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నరసరావుపేట పట్టణంలో భారీ 'క్యాండిల్ ర్యాలీ' నిర్వహించారు. స్థానిక పల్నాడు రోడ్డులోని ప్రసిద్ధ ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ వెలుగుల నిరసన ర్యాలీ పట్టణ ముఖ్య వీధుల గుండా సాగింది. పల్నాడు జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థల్లో రాత్రింబవళ్లు సేవలందిస్తున్న సుమారు 600 మందికి పైగా కాంట్రాక్ట్ మెడికల్ సిబ్బంది చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని, నిరసన తెలుపుతూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తమ హక్కుల సాధనకై పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే క్రింది ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ: ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కాంట్రాక్ట్ వైద్య సిబ్బందిని ఎటువంటి షరతులు లేకుండా వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. 100% గ్రాస్ సాలరీ:ఒప్పంద సిబ్బందికి వంద శాతం పూర్తి గ్రాస్ వేతనాన్ని తక్షణమే అమలులోకి తీసుకురావాలి. వైద్య రంగంలో అత్యవసర సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంట్రాక్ట్ విధానం వద్దు - రెగ్యులర్ విధానమే ముద్దు", "కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులకు న్యాయం చేయాలి" అంటూ ఉద్యోగులు చేసిన మిన్నంటిన నినాదాలతో పట్టణ వీధులన్నీ మార్మోగాయి. కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగుల పోరాటానికి వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. ఎన్జీఓ సంఘం ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రముఖ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ , సీఐటీయూ నాయకులు క్యాండిల్ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. పోరాటం న్యాయమైనదని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ఆసుపత్రుల నుంచి స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ అధికారులు, రేడియోగ్రాఫర్లు, పారామెడికల్ టెక్నీషియన్లు, బయోమెడికల్ ఇంజినీర్లు మరియు ఇతర కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ మరియు పర్చూరు శాసన సభ్యులు

**బాపట్ల బ్యూరో (ఎస్ఏపీఎన్) :** బాపట్ల జిల్లా మండల కేంద్రమైన మార్టూరు గ్రామములోని తాసిల్దార్ కార్యాలయ ప్రాంగాణంలో శుక్రవారం ప్రత్యేక పీ.జి.అర్.యస్ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా డాక్టర్ వినోద్ కుమార్ మరియు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు చూపే లక్ష్యంతో మండల కేంద్రం మార్టూరు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన 'ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా యద్దనపూడి, మార్టూరు మండలాల పరిధిలో సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి




సాంబశివరావు, ఇన్‌చార్జి డీఆర్ఓ లవన్న, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ, డీపీఓ ఎల్.ప్రభాకర్‌రావులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరయ్యారు. యద్దనపూడి, మార్టూరు మండల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా విని వివరాలు తెలుసుకున్నారు.భూ సమస్యలు, రెవెన్యూ, వ్యవసాయం, పశుసంవర్ధక, సంక్షేమం, వైద్యం, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను అర్జీదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ అధికారులు ఏ.వి.విజయలక్ష్మి, నీలిమ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ.లక్ష్మి, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వరి దిగుబడిపై వర్రీ!



**ఢిల్లీ :** దేశంలో గత 20 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా వరి దిగుబడి పడిపోయింది. పంట పక్వానికి వచ్చే సమయంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదు కావడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉన్నదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం వంటి ఇతర ఎగుమతి దేశాల్లో ఇప్పటికే ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తి, ఎగుమతి దేశంలో దిగుబడి తగ్గడం వల్ల స్థానిక ధరలు పెరుగుతాయని, ఎగుమతులు ఖరీదైనవిగా మారుతాయని వారు పేర్కొంటు న్నారు. 'తక్కువ వర్షపాతం కారణంగా ఈ ఏడాది దిగుబడి తగ్గుతుంది. 10 మిలియన్ మెట్రిక్ టన్నులు తగ్గుతుందని అంచనా వేస్తున్నాం' అని రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ కృష్ణారావు తెలిపారు. గత ఏడాది 154 మిలియన్ టన్నులతో పోలిస్తే ఈ ఏడాది 6.5 శాతం తగ్గ వచ్చునని, 2009/10 తర్వాత తొలిసారిగా ఆ స్థాయి తగ్గుదల నమోదవుతున్నదనిఅన్నారు. చాలామంది రైతులు ప్రీమియం వరి రకాలను పండించడంతో వారికి ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తున్నాయని, దీంతో వారు తమ పంటను తక్కువ పరిమాణంలో ప్రభుత్వానికి అమ్ముతున్నారని చెప్పారు.

## చంద్రబాబుకు జలీల్ ఖాన్ అల్టిమేటం

**విజయవాడ:** ముస్లింల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జలీల్‌ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు కేవలం చిన్న చిన్న నామినేటెడ్ పోస్టులతో మాత్రమే సరిపెడుతున్నారన్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే చంద్రబాబుకు జలీల్‌ఖాన్ అల్టిమేటం జారీ చేశారు. ఈసారి కచ్చితంగా విజయవాడ మేయర్ సీటు ముస్లింలకే ఇవ్వాలన్నారు. 'విజయవాడ మేయర్‌గా మైనార్టీలకు అవకాశం కల్పించాలి. మేయర్ సీటు మహిళలకు రిజర్వ్ అయితే నా కుమార్తెకు అవకాశం ఇవ్వాలి. బీజేపీ మైనార్టీల ఇంపార్టెన్స్ ను గుర్తించింది. కానీ చంద్రబాబు వైఖరి నాకు నచ్చడం లేదు. అనుభవం ఉండి కూడా చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు సరికాదు. విజయవాడలో పార్టీ గెలవాలన్నా...పార్టీ క్యాండెట్ గెలవాలన్నా మైనార్టీల సహకారం అవసరం.

ముస్లింలకు మేయర్‌గా అవకాశం ఇస్తే పోటీ ఉండదు. నాకు ఊహతెలిసినంత వరకూ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే టిక్కెట్ ముస్లింలకే ఇచ్చేవారు. మొన్నటి ఎన్నికల్లో జిల్లాలోనే ముస్లింలకు ఎమ్మెల్యే సీటు లేకుండా చేశారు. ఆ రోజే నాకు బాధ కలిగినా నాలోనే దాచుకున్నా. ముస్లింలకు ఎమ్మెల్సీ ఇవ్వడం లేదు ...రాజ్యసభ సభ్యుడు ఇవ్వడం లేదు. చిన్న చిన్న నామినేటెడ్ పదవులతో సరిపెట్టేస్తున్నారు. 2019లో నా కుమార్తెను కోరి తెచ్చుకున్నారు. ఇండిపెండెంట్‌ను బరిలోకి దించి నా కుమార్తెను ఓడించారు. నా కుమార్తె ఓటమిలో కూడా కుట్ర జరిగిందికానీ నేను పేర్లు చెప్పలేదు ... చెప్పినా ఉపయోగం ఉండదని చెప్పలేదు. టీడీపీలోయాక్షన్ ఉండదరు.. రియాక్షన్ అసలే ఉండదు' అని మండిపడ్డారు.

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు



**విజయవాడ:** మాజీమంత్రి అంబటి రాంబాబుపై కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆయనపై మరో కేసు మోపేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. తాజాగా ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 11వ తేదీనే విచారణకు హాజరు కావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు జారీ చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. అయితే, అంబటి రాంబాబు మాత్రం ఈడీ నుంచి తనకు ఎలాంటి నోటీసులు రాలేదని తెలిపారు. తాము ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం అందించామని, ఈ వ్యవహారంలో అంబటి రాంబాబు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈడీ విచారణకు సంబంధించి తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## మారనున్న పాస్‌పోర్ట్ రూల్స్..

### 15 ఏళ్లలోపు పిల్లలకు కొత్త నిబంధనలు ఇవే

**ఢిల్లీ :**దేశంలో పాస్‌పోర్ట్ రూల్స్ మారి పోనున్నాయి. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కొత్త రూల్స్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం, సెప్టెంబర్ 17న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లలోపు పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టు వ్యాలిడిటీ ఇకపై ఐదేళ్ల కాలపరిమితితోనే ఉంటుంది. అలాగే, 18 ఏళ్లు వచ్చే వరకు మాత్రమే వ్యాలిడిటీ కలిగి ఉంటుంది.

18 ఏళ్ల తర్వాత జారీ అయ్యే పాస్‌పోర్టు మాత్రమే అదనపు వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ అంశంలో ఇప్పటికే ఉన్న పాస్‌పోర్ట్ రూల్స్, 1980 చట్టానికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మార్పులు చేసింది. పాస్‌పోర్ట్స్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2026 పేరిట కొత్త నిబంధనలతో గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించి సవరించిన రూల్ 12 (1ఏ) ప్రకారం.. 15 ఏళ్లలోపు వారికి 36 పేజీల పాస్‌పోర్టు జారీ చేస్తారు. 15 ఏళ్ల వయసులో తీసుకుంటే.. ఐదేళ్ల కాలపరిమితికి గాను 20 ఏళ్లు వచ్చే వరకు వ్యాలిడిటీ ఉండదు. గరిష్టంగా 18 ఏళ్ల వరకు మాత్రమే దీని వ్యాలిడిటీ ఉంటుంది.

13 ఏళ్లకు పాస్‌పోర్ట్ జారీ అయితే ఐదేళ్ల వ్యాలిడిటీతో 18 ఏళ్ల వరకు వాడుకోవచ్చు. అలాగే, 14, 15 ఏళ్లు అయితే.. గరిష్టంగా మరో నాలుగు, ఐదు సంవత్సరాల వ్యాలిడిటీ మాత్రమే వస్తుంది. 18 ఏళ్లు వచ్చిన వారు కొత్త పాస్‌పోర్టు తీసుకోవాల్సిందే. పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టులో గరిష్టంగా 36 పేజీలు మాత్రమే ఉంటాయి. పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం ఇటీవల సవరించిన సంగతి తెలిసిందే. ఫీజులు పెంచుతూ అమెండ్‌మెంట్ రూల్ 8ను తీసుకొచ్చింది. దీనిపై ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది.

# 'ఆర్నబ్' తుపాను ముంచుకొస్తోంది!



**విశాఖపట్నం:** బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. ఈ ఏడాది తొలి తుపాను ముంచుకొస్తున్నట్లు వాతావరణ నమూనాలు స్పష్టమైన హెచ్చరికలు జారీచేస్తున్నాయి. ఈ నెల 20 తర్వాత తూర్పు మధ్య బంగాళా ఖాతంలో ఒక బలమైన వాయుగుండం ఏర్పడే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సముద్రంలో నెలకొన్న అనుకూల పరిస్థితుల నేపథ్యంలో ఈ వాయుగుండం మరింతగా బలపడితే, అది తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉంది. దీని ప్రభావం ఉత్తరాంధ్రపై ఉండబోతుందని అంతర్జాతీయ వాతావరణ నమూనాలు (గ్లోబల్ మోడల్స్) అంచనా వేస్తున్నాయి.

**19న అల్పపీడన ద్రోణి..**

ఈ నెల 19న అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి ఏర్పడనుంది. ఇది క్రమంగా బలపడుతూ పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి 22 నుంచి 26 నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉంది. ఈ సమయంలో ఇది వాయుగుండంగా మారి మరింత బలపడే సూచనలున్నాయి. అనంతరం.. ఈ ఏడాది దేశంలో మొదటి తుపానుగా మారబోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపానుగా బలపడితే.. దీనికి బంగ్లాదేశ్ సూచించిన 'ఆర్నబ్'గా నామకరణం చేయనున్నారు. ఆర్నబ్ అంటే బెంగాలీలో సముద్రం లేదా మహా సముద్రం అని అర్థం.

**గ్లోబల్ మోడల్స్ ఏం చెబుతున్నాయంటే..?**

ఈ తుపాను తీవ్రతపై గ్లోబల్ మోడల్స్ ఆందోళనకరమైన అంచనాలను వెలువరిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వ్యవస్థకు.. ప్రస్తుతం వాతావరణంలో ఉన్న ఎల్‌నినో పరిస్థితులు, అదేవిధంగా.. తీవ్రమైన వేడిగాలులు తోడైతే ఇది మరింత వేగంగా శక్తిని పుంజుకుంటుందని అంచనా వేస్తున్నాయి. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితులు జతకలిస్తే, 'ఆర్నబ్' కేవలం సాధారణ తుపానుగానే కాకుండా అత్యంత 'తీవ్ర తుపాను'గా బలపడే సూచనలు కూడా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. అయితే, అల్పపీడనం వాయుగుండంగా మారిన తర్వాత దీని తీవ్రతపై మరింత స్పష్టత రావచ్చు.

**ఉత్తరాంధ్ర-ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం..**

ఇక ఈ 'ఆర్నబ్' తుపాను గమనం ప్రధానంగా తూర్పు తీరం వైపు పయనించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజా అంచనాల ప్రకారం.. ఈ తుపాను ఉత్తరాంధ్ర, పశ్చిమ ఒడిశా ప్రాంతాల మధ్య తీరందాటే అవకాశం ఉందని సూచిస్తోంది. అల్పపీడనం ఏర్పడిన తర్వాత 20 నుంచి ఒడిశాతో పాటు ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో నెమ్మదిగా వర్షాలు మొదలై 21 రాత్రి నుంచి లేదా 22 ఉదయం నుంచి భారీ వర్షాలు పడేందుకు ఆస్కారం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది.

**వర్షాభావ పరిస్థితుల నుంచి ఉపశమనం..**

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితుల్లో 'ఆర్నబ్' రాక ఒక రకంగా వరమే అని చెప్పాలి. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాల్లేక ప్రాజెక్టులు అడుగంటి, భూగర్భ జలాలు పడిపోయి తీవ్ర జలసంక్షోభం నెలకొంది. ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు, రైతులు విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో తుపాను వస్తే రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. దీంతో జలసంక్షోభం నుంచి రాష్ట్రాన్ని కొంతమేర గట్టెక్కించడంతో పాటు, డార్క్ జోన్‌గా మారుతున్న భూగర్భ జలాలకు ప్రాణం పోసి కాస్త ఉపశమనం కలిగిస్తాయని వాతావరణ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సాగర గర్భంలో వజ్రాయుధం.. స్వార్మ్



**విశాఖపట్నం:** సముద్రజలాల్లో శత్రుదేశాల కదలికలను తిప్పికొట్టడంతోపాటు వారు రహస్యంగా అమర్చే మందుపాతర్లు (మైన్స్) గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేసింది. విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీస్ ల్యాబోరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) నేతృత్వంలో 'స్వార్మ్ టెక్నాలజీస్ ఫర్ మైన్ న్యూట్రలైజేషన్' ప్రాజెక్టు కింద 'మ్యాన్--పోర్టబుల్ అటానమస్ అండ్ వాటర్ వెహికల్ (ఎంపీ అండ్ ఏయూవీ)ని అభివృద్ధి చేశారు.

అత్యంత అధునాతన సాంకేతికతతో పనిచేసే ఈ సరికొత్త ఏయూవీలు, భారత యుద్ధనౌకలకు సురక్షితమైన మార్గాన్ని సుగమం చేయడంలో గేమ్ చేంజర్‌గా మారనున్నాయి. యుద్ధ సమయాల్లో సముద్రజలాల్లో నౌకల రాకపోకలను అడ్డుకోవడానికి శత్రువులు నీటి అడుగున మందుపాతర్లు అమరుస్తారు. ఇవి ఎక్కడున్నాయో తెలుసుకోవడం కష్టమైన పని. ముఖ్యంగా మైన్స్‌ని సముద్రజలాల్లో పసిగట్టాలంటే కచ్చితంగా బాంబ్‌స్క్వాడ్ తరహా రెస్క్యూ బృందాలు.. ప్రాణాలు పణంగాపెట్టి వెళ్లాల్సి వస్తుంది. కొన్నిసార్లు వాటిని కనిపెట్టడం అసాధ్యంగా మారుతుంది. ఇలాంటి ఇబ్బందులకు చెక్‌పెడుతూ డీఆర్‌డీవో ఓ సరికొత్త ఆయుధాన్ని రూపొందించింది. సముద్రంలో ఉన్న మైన్స్‌ని అటానమస్ విధానంలో గుర్తించడం, వర్గీకరించడం, కచ్చితమైన లొకేషన్‌ను కనుగొని ని ర్వీర్యం చేసేందుకు స్వార్మ్ ఏయూవీలను నిర్మించింది. ఇవి మైన్ ఫీల్డ్స్ ఉన్న ప్రమాదకర ప్రాంతాల్లో సైతం నౌకలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా సురక్షితమైన మార్గదర్శకత్వం వహిస్తాయి. సాధారణంగా ఈ మైన్స్ తొలగించడానికి పట్టే సమయం కంటే.. ఈ టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా నౌకలు సురక్షితంగా ఆ ప్రాంతాన్ని దాటేలా చేయవచ్చు.

**డీప్ లెర్నింగ్ పరిజ్ఞానంతో నిర్మాణం :** ఈ అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్‌లో సైడ్‌స్కాన్ సోనార్, హై రిజల్యూషన్ అండర్ వాటర్ కెమెరాలను ప్రైమరీ పేలోడ్‌లుగా అమర్చారు. ఇవి సముద్రగర్భంలో మైన్స్ పోలిన వస్తువులను.. రియల్ టైమ్‌లో పసిగట్టేస్తాయి. ఇందులో నిక్షిప్తం చేసిన అత్యాధునిక డీప్ లెర్నింగ్ ఆధారిత టార్గెట్ రికగ్నిషన్ అల్గారిథమ్స్.. ఆ ఆబ్జెక్టులను ఆటోమేటిక్‌గా, కచ్చితత్వంతో విశ్లేషిస్తాయి. మనుషుల ప్రమేయం లేకుండానే నిర్ణయాలు తీసుకునే ఈ ఏఐ పరిజ్ఞానం వల్ల మిషన్‌కు పట్టే సమయం భారీగా ఆదా అవుతుంది.

**సులువుగా మోసుకెళ్లేలా..** ఈ సరికొత్త టెక్నాలజీలో మల్టీపుల్ ఏయూవీలు ఒకేసారి బృందంగా (స్వార్మ్) పనిచేస్తాయి. ఆపరేషన్ జరుగుతున్న సమయంలో ఈ ఏయూవీల మధ్య ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి కోసం పటిష్టమైన అండర్ వాటర్ అకౌస్టిక్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఇంటిగ్రేట్ చేశారు. దీనిద్వారా సముద్రగర్భంలో స్వార్మ్ బృందం డేటాను పంచుకుంటూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని మెరుగ్గా అంచనా వేస్తుంది.

తద్వారా శత్రువుల మైన్స్‌ని మరింత వేగంగా ఛేదించవచ్చు. ఈ ప్రాజెక్టులోని ఏయూవీలు మ్యాన్ పోర్టబుల్ క్లాస్‌కు చెందినవి. అంటే వీటి బరువు, పరిమాణం తక్కువగా ఉండటం వల్ల నావికులు తమ చేతులతో సులభంగా మోసుకెళ్లి నీటిలో ప్రయోగించే వీలుంటుంది. కేవలం నిఘాకోసమే కాకుండా, మైన్స్‌ని ని ర్వీర్యం చేయడానికి కూడా ఈ ఏయూవీలు అద్భుతంగా పనిచేస్తాయి. పరిశ్రమల భాగస్వామ్యంతో వీటిని అభివృద్ధి చేసే ప్రక్రియ పురోగతిలో ఉంది.

**ఎన్ఎస్‌టీఎల్ సహా ఐదు ల్యాబ్‌ల మేధోమథనం :** మైన్‌కౌంటర్ మెజర్ మిషన్ల (ఎంసీఎం) కోసం ఉద్దేశించిన ఈ సరికొత్త తరం ఎంపీ--ఏయూవీలను పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేశారు. ఈ స్వార్మ్ నిర్మాణంలో విశాఖలోని ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన పాత్ర పోషించగా.. కేరళలోని ఎన్‌పీవోఎల్, హైదరాబాద్‌లోని ఆర్‌సీఐ, డీవైఎస్ఎల్ అండ్ ఏటీ, పుణెలోని హెచ్‌ఈఎంఆర్ఎల్ ల్యాబ్‌లు సంయుక్తంగా ప్రాజెక్టుని రూపొందించాయి. రెండురోజుల కిందట నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్‌లో స్వార్మ్ ఏయూవీల పనితీరు, క్రిటికల్ మిషన్ పారామీటర్లు విజయవంతంగా నిర్ధారణ అవ్వడంతో భారత నౌకాదళం సరికొత్త అధ్యాయానికి చేరువైంది. సముద్రజలాల్లో ఇండియన్ నేవీ ఆధిపత్యాన్ని ఈ స్వార్మ్ టెక్నాలజీ మరింత పెంచుతుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

**సత్తెనపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండాలని సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి రూరల్ మండలానికి చెందిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి వైయస్ఆర్‌సీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలకు పార్టీ తరఫున న్యాయ బృందం సహకారం అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులకు తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులంతా సమ



న్వయంతో పనిచేసి ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళిక ఏదీ?

**నెల్లూరు:** ఎల్ నినో ప్రభావంతో నెల్లూరు జిల్లా తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 40 శాతం వర్షపాతం లోటు ఉండటంతో అనేక ప్రాంతాల్లో పంటల సాగు దెబ్బతిన్నదని, కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు, అవసరమైన విత్తనాల పంపిణీ వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాలు లేక పశువులకు మేత కొరత ఏర్పడి, కొన్ని ప్రాంతాల్లో రైతులు పశువులను అమ్ముకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు.

సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటితో పాటు తాగునీటి అవసరాలపైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాకాణి తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించుకుని సోమశిల, కండలేరు జలాశయాలను నింపేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నీటి కొరత కారణంగా రైతులు పంటలు సాగు చేయలేక పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**నంద్యాల జిల్లా :** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలో వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ నేతృత్వంలో, పగిడ్యాల మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుల్యాల నాగిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆత్మవిశ్వాసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. డాక్టర్ ధార సుధీర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించాలని కోరారు. వార్డు సభ్యుడి స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## విశాఖలో వేలాది కుటుంబాలకు ఇంటిపై పూర్తి హక్కు



**హైదరాబాద్:** రాష్ట్రంలో పేదలకు కలగా ఉన్న సొంతిల్లు.. ఇక శాశ్వత హక్కుగా మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న వేలాది పేద కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. శనివారం విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని.. 11 మండలాల పరిధిలో రూ.8,874 కోట్ల విలువైన 19,33,853 చదరపు గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు.

"ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదు. 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చరిత్రాత్మక సందర్భం. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి ఒక విలువైన ఆస్తి దక్కుతుంది.. భవిష్యత్తుకు భద్రత కలుగుతుంది.. బిడ్డలకు వారసత్వ సంపద లభిస్తుంది.. ఆత్మగౌరవం, భరోసా దక్కుతుంది. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇంటిపై హక్కు కోసం ఎదురుచూసిన ప్రతి కుటుంబంలో ఆనందం చూడటమే మా ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రజల కోసం రోజుకో ముందడుగు వేస్తున్నాం. ప్రజల కలలకు రెక్కలు తొడుగుతున్నాం. ప్రపంచస్థాయి నగరంగా మారుతున్న విశాఖలో సామాన్య కుటుంబాలకు భరోసాను కల్పిస్తున్నాం. వారిని అభివృద్ధిలో భాగస్వాములు చేస్తున్నాం"అని సీఎం పేర్కొన్నారు.

## నివాస రుజువుగా రేషన్ కార్డు, ఆధార్

**అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాలు సహా అన్ని ప్రయోజనాలకు రేషన్ కార్డు, ఆధార్‌నే నివాస రుజువుగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పీవీటీజీ (ఆదివాసీ గిరిజనులు) కుటుంబాల వారికి ఆధార్ నమోదు, నవీకరణ కోసం తహసీల్దార్లు నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆదేశిస్తూ సీఎస్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో నివాస రుజువుగా రేషన్ కార్డు, ఆధార్ నియామకాలు, సైనిక దళాల రిక్రూట్‌మెంట్ తదితర నిర్దిష్ట ప్రయోజనాల కోసమే నివాస ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటికే వాటిని ఇచ్చి ఉంటే.. మళ్లీ జారీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తహసీల్దార్ల ద్వారా నివాస ధ్రువీకరణ పత్రాలజారీపై బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్ని సవరిస్తూ మరో జీవో ఇచ్చారు.

## నిర్ణీత తేదీలో 'దీపం' రాయితీ

**అమరావతి:** దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను అందిస్తున్నా..రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో ఎప్పుడు జమ అవుతుందో తెలియడం లేదు. ప్రభుత్వం ఏడాదికి రూ.2,900 కోట్లు ఈ పథకం కింద ఖర్చు పెడుతున్నా ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో మైలేజీ రావడం లేదనే అభిప్రాయం ఉంది. అందువల్ల ఇక నుంచి సిలిండర్ తీసుకున్నాక తర్వాత నెలలో నిర్ణీత తేదీన రాయితీ సొమ్మును విడుదల చేయాలని భావిస్తున్నారు. దీనిపై ప్రస్తుతం పౌరసరఫరాలశాఖ, ఆర్థికశాఖ అధికారులు చర్చిస్తున్నారు.దకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 అక్టోబరు 31న దీపం-2 ప్రారంభించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారు. ఏప్రిల్ నుంచి జులై వరకు ఒకటి, ఆగస్టు నుంచి నవంబరు వరకు రెండో సిలిండర్, డిసెంబరు నుంచి మార్చి వరకు మూడో సిలిండర్‌కు రాయితీ విడుదల చేస్తున్నారు. ప్రస్తుత విధానం ప్రకారం.. ప్రభుత్వం ఒక్కో విడతకు సంబంధించిన రాయితీ సొమ్మును ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఇస్తోంది. లబ్ధిదారుడు సిలిండర్ బుక్ చేసుకుని.. సొమ్ము చెల్లించి డెలివరీ తీసుకుంటున్నారు. తర్వాత రాయితీ మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేస్తున్నారు. అది ఎప్పుడు జమ అవుతుందో లబ్ధిదారులకు తెలియడం లేదు. కొందరికి ఒకటికి మించి బ్యాంకు ఖాతాలు ఉండటంతో ఏ ఖాతాలో పడిందో కూడా గుర్తించలేకపోతున్నారు. కొత్త విధానంలో ఉదాహరణకు సెప్టెంబరు నెలలో వంటగ్యాస్ సిలిండర్లు తీసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులకు అక్టోబరు నెలలో నిర్ణీత తేదీన రాయితీ సొమ్ము జమ చేస్తారు. అక్టోబరులో సిలిండర్లు తీసుకున్న వారికి నవంబరులో రాయితీ విడుదల చేస్తారు. నెలలో ఏ తేదీన విడుదల చేయాలనేది త్వరలో నిర్ణయిస్తారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర నగదు బదిలీ పథకాల తరహాలోనే దీపం-2 రాయితీ కూడా ఎప్పుడు విడుదల చేస్తారో ముందే తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 1.61కోట్ల వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం-1 కింద ఇచ్చినవి 58.42 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో వారికి 0.74 లక్షలు, సీఎస్ఆర్ కింద ఇచ్చినవి 6.24 లక్షలు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 11.37 లక్షలు, ఇతర కనెక్షన్లు 84.42 లక్షలు ఉన్నాయి. ఇందులో అర్హులకు ప్రభుత్వం ఉచిత సిలిండర్లు ఇస్తోంది. ఒక్కో విడతలో సుమారు 92 లక్షల నుంచి కోటి సిలిండర్లు రాయితీపై అందిస్తున్నారు.

## 'ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడను'

**గుంటూరు:** రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులో ఈ నెల 20 తేదీన గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించనున్న సమావేశానికి ఏర్పాట్లను నియోజకవర్గ సమన్వయకర్తలు షేక్ నూరి ఫాతిమా, వనమా బాల వజ్రబాబు, మాజీ కార్పొరేటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కొత్తగా 76 వార్డులు ఉన్నాయి. రేపు సమష్టిగా పార్టీ శ్రేణులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఐక్యంగా రాబోయే ఎన్నికలకు వెళ్తున్నాం. ఈ రెండేళ్లలో చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వైఎస్ జగన్ సంక్షేమ కార్యక్రమాలతో ఈ కూటమి సర్కార్ పోటీ పడలేకపోతోంది. రాబోయే ఎన్నికల్లో అధికార దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోం. పోలీసులతో కట్టడి చేసే ప్రయత్నం చేస్తే సహించం" అంటూ అంబటి రాంబాబు తేల్చి చెప్పారు. దొంగ ఓట్లు ఉండటానికి వీల్లేదు. రాబోయే ఎన్నికల్లో ఒకరు ఒక ఓటు మాత్రమే వేయాలి. రెండో ఓటు వేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ పెడితే వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన నేను భయపడను. చెప్పాలి అనుకున్నది మేము ధైర్యంగా చెప్తాము. తండ్రి కొడుకులు వ్యవస్థలను నాశనం చేస్తున్నారు" అని అంబటి రాంబాబు దుయ్యబట్టారు.

- మోదీ ప్రస్థానంలో మరో మైలురాయి
- గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలై.. వరుసగా మూడుసార్లు ప్రధానిగా దేశానికి నాయకత్వం
- సేవ, సంకల్పం, సంస్కరణలే ప్రస్థానానికి పునాది
- నేడు ప్రధాని మోదీ జన్మదినం
- విస్తృతంగా వివిధ కార్యక్రమాలు

సత్తెనపల్లి న్యూస్ : భారత రాజకీయ చరిత్రలో సుదీర్ఘకాలం రాజ్యాంగ బద్ధమైన ప్రజా పదవుల్లో కొనసాగిన అరుదైన నాయకుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు. సెప్టెంబర్ 17న ఆయన జన్మదినం సందర్భంగా.. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఆయన రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలిచింది. గుజరాత్ ముఖ్య మంత్రిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం.. అనంతరం దేశ ప్రధానిగా వరుసగా మూడు పర్యాయాలు కొనసాగింది.




# ప్రజాజీవితంలో పాతికేళ్లు..

### గుజరాత్ నుంచి దేశ నాయకత్వం వరకు..

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ.. రాష్ట్రంలో మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, విద్యుత్ రంగం వంటి అంశాలపై దృష్టి సారించారు. గుజరాత్ అభివృద్ధి నమూనాను జాతీయ స్థాయిలో రాజకీయ చర్చకు తీసుకురావడంలో ఆయన పాత్ర కీలకంగా మారింది. 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించి వరుసగా మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను తన పాలనా ప్రాధాన్యాలుగా ముందుకు తీసుకెళ్లారు.

### సంక్షేమం నుంచి డిజిటల్ విప్లవం వరకు..

మోదీ ప్రభుత్వ హయాంలో డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్, మేక్ ఇన్ ఇండియా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు, కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలయ్యాయి. డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితం, మౌలిక వసతుల విస్తరణ వంటి రంగాల్లోనూ కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఆర్థిక రంగంలో భారత్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగింది. అంతర్జాతీయ దౌత్య వేదికపైనా భారత్ తన ప్రాధాన్యాన్ని పెంచుకునే దిశగా మోదీ ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది. జీ-20 అధ్యక్షత సమయంలో గ్లోబల్ సౌత్ దేశాల అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

### కీలక నిర్ణయాలతో ప్రత్యేక ముద్ర

ఆర్టికల్ 370కి సంబంధించిన రాజ్యాంగ మార్పులు, నూతన విద్యా విధానం, రక్షణ రంగంలో ఆత్మ నిర్భరత, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిలో కొన్ని నిర్ణయాలు దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు, భిన్నాభిప్రాయాలకు దారి తీశాయి.

### సేవా పఖ్వాడాతో జన్మదిన వేడుకలు

ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'సేవా పఖ్వాడా' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు, మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. ఎక్స్‌ప్రెస్‌వేలు, వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాలు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణతో పాటు యువత, స్టార్టప్ రంగాలకు ప్రోత్సాహం ఇవ్వడంపై దృష్టి సారిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన ప్రస్థానం.. దేశ ప్రధానిగా మూడు పర్యాయాల నాయకత్వం వరకు సాగింది. ప్రజాజీవితంలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## సెమీకండక్టర్ రంగం మరో దశలోకి అడుగుపెట్టింది : ప్రధాని మోదీ



**ఢిల్లీ** : భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేళ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమీకండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోదీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ ఇండియా-2026 ఈవెంట్ దిల్లీలో సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

## పెళ్లి బృందం బస్సును ఢీకొన్న కంటైనర్ : 40 మందికి గాయాలు

**అన్నవరం:** కాకినాడ జిల్లా తుని మండలం రాజుల కొత్తూరు సమీపంలో పెళ్లి బృందం బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ఉన్నారు. తునిలో వివాహ వేడుక ముగించుకుని కాకినాడ జిల్లా ఉప్పాడకు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు అద్దాలు పగులగొట్టి ప్రయాణికులు బయటపడ్డారు. బస్సులో ఉన్న 40 మందికి గాయాలు కాగా, వారిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులంతా ఉప్పాడకు చెందినవారిగా గుర్తించారు.

## దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు



**వారణాసి:** భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోందని.. దీన్ని ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. "దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి.

కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. ఆ సమయంలో 140 కోట్ల మందిని ఆయన కాపాడారు. ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం దేశంలోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతోంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతోంది. బేటీ బచావో.. బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు. దేశంలో తీవ్రవాదం లేకుండా చర్యలు చేపట్టారు. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను పరిష్కరించారు" అని చంద్రబాబు కొనియాడారు.

## భగవాన్ విశ్వకర్మకు వైఎస్ జగన్ నివాళులు



**తాడేపల్లి:** విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరాట్ విశ్వకర్మ భగవాన్, గాయత్రీ దేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం వైఎస్ జగన్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు ఎస్.ఎం. పవిత్ర, తోలేటి శ్రీకాంత్, విశ్వబ్రాహ్మణ నాయకులు ఎస్.డి. మురళీకృష్ణ, కె. గురవాచారి, ఉదయ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

## పెట్రోల్, డీజిల్‌పై విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు



**ఢిల్లీ** : అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గులు, రీఫైనింగ్ మార్జిన్లలో మార్పుల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశం నుంచి ఎగుమతి అయ్యే పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం(ఏటీఎఫ్)పై విండ్‌ఫాల్ టాక్స్ (ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం)ను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సమీక్షలో భాగంగా డీజిల్‌పై గతంలో ఉన్న లీటరుకు రూ.25 సుంకాన్ని రూ.20కి తగ్గించారు. డీజిల్‌పై ప్రత్యేకదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.20గా నిర్ణయించగా, రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ (ఆర్‌ఐసీ)ను పూర్తిగా సున్నాకు తగ్గించారు. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ఎగుమతులపై లీటరుకు రూ.19గా ఉన్న పన్నును రూ.15కు కుదించారు. పెట్రోల్‌పై గతంలో ఉన్న లీటరుకు రూ.1.5 సుంకాన్ని రూ.0.50 (50 పైసలు)కు తగ్గించారు. స్థానిక మార్కెట్లో విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పు లేదని, ఇవి యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మూలంగా ముడిచమురు సరఫరాపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ సౌదీ అరేబియా ఆసియా రిఫైనరీలకు అదనపు చమురు సరఫరాను ప్రారంభించడంతో బ్రెంట్ క్రూడ్, డబ్ల్యూటీఐ ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ విపణిలో డిమాండ్, రిఫైనింగ్ లాభాల సమీక్ష ఆధారంగా దేశీయ ఎగుమతిదారులపై భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ సవరణ చేసింది. దేశీయంగా ఇంధన కొరత ఏర్పడకుండా చూడటంతో పాటు, విదేశీ మార్కెట్లలో అధిక లాభాల కోసం మాత్రమే ఎగుమతి చేయడాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ తరహా పన్నులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. ప్రస్తుత కోత వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్, నాయరా ఎనర్జీ, ఓఎన్‌జీసీ వంటి దిగ్గజ చమురు శుద్ధి, ఉత్పత్తి సంస్థల లాభదాయకత మెరుగయ్యే అవకాశం ఉంది.

## రాత పరీక్ష ద్వారానే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ

**అమరావతి** : రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న మెరిట్ ప్రాతిపదికన వెయిటేజ్ పద్ధతిని కాకుండా రాత పరీక్ష ద్వారా నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెరిట్ ఆధారంగా నియామక ప్రక్రియ ఉండాలని ఈనెల 13, 14న జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేస్తూ తాజా జీవోను పశు సంవర్ధక శాఖ గురువారం విడుదల చేసింది.

## శ్రీకాకతీయ హైస్కూల్ టీచర్ షేక్ బాజీకి 'గ్లోబల్ ఐకానిక్ అవార్డ్'

**గుంటూరు (ఎస్‌ఎపీఎన్):** విద్యా రంగంలో విశేష సేవలందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న పెదకూరపాడు శ్రీ కాకతీయ హైస్కూల్ ఉపాధ్యాయులు, కన్నెగండ్ల గ్రామ నివాసి షేక్ బాజీ ప్రతిష్టాత్మక 'గ్లోబల్ ఐకానిక్ అవార్డ్' వరించింది. గుంటూరు నగరంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందున్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తూ, సమాజంలో విద్యార్థులను బాధ్యతాయుతమైన ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో షేక్ బాజీ అందిస్తున్న సేవలను పలువురు వక్తలు కొనియాడారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా, నైతిక విలువలు మరియు నాయకత్వ లక్షణాలను నేర్పిస్తూ వారి పురోగతికి నిరంతరం శ్రమిస్తున్నందుకు గానూ ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు మరియు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "షేక్ బాజీ సారథ్యంలో మరెంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. ఆయన సేవలకు లభించిన ఈ గుర్తింపు కన్నెగండ్ల గ్రామానికి, శ్రీ కాకతీయ హైస్కూల్‌కు ఎంతో గర్వకారణం. భవిష్యత్తులో ఆయన ఇటువంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో అవార్డులు, పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాము" అని ఆకాంక్షించారు.



# పైకి కూటమి.. లోపల కుస్తీ!

- స్థానిక పోరుతో బయటపడుతున్న సీట్ల సర్దుబాటు లెక్కలు
- కూటమిలో గ్యాప్..
- స్థానిక పోరు వేడెక్కేనా?
- పైకి సమన్వయం.. లోపల బలప్రదర్శన
- సీట్ల సర్దుబాటుపై ఇంకా స్పష్టత కరవు
- టీడీపీ, జనసేనలో కేడర్ కదలికలు
- డీఎస్సీ వ్యవహారంపైనా పెరుగుతున్న దూరం

అమరావతి: అధికార కూటమిలో పైకి సమన్వయం కనిపిస్తున్నా.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అంతర్గతంగా విభేదాల చర్చ ఊపందుకుంటోంది. ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కాలి? ఏ ప్రాంతంలో ఎవరు పోటీ చేయాలి? అనే అంశాలపై ఇప్పటి వరకు స్పష్టత రాకపోవడం కూటమి పార్టీల్లో ఆసక్తికర పరిణామాలకు దారితీస్తోంది. సమన్వయ సమావేశాల పేరుతో మూడు పార్టీల మధ్య గ్యాప్ లేదని నేతలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం తమ బలాన్ని చాటుకునే ప్రయత్నాలు మొదలయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో టీడీపీ, జనసేనలు తమ కిందిస్థాయి కేడర్‌ను సమీకరించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. నియోజక వర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయిలో పార్టీ శ్రేణులను కదిలించి ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకోవాలనే ఉద్దేశంతో నాయకత్వం నుంచి సూచనలు వెళ్లినట్లు సమాచారం.



### 'కాంక్లేవ్'తో టీడీపీ కదలికలు

టీడీపీ అధిష్ఠానం 'లీడర్‌షిప్ కాంక్లేవ్' పేరుతో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు సోమ, మంగళవారాల్లో పార్టీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. ఇదే సమయంలో నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చర్చకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ నిధుల ప్రకటన రావడాన్ని ప్రతిపక్షాలు, రాజకీయ వర్గాలు తమదైన రీతిలో విశ్లేషిస్తున్నాయి. ఎన్నికల ముందు అభివృద్ధి నిధుల ప్రకటనలను కొందరు రాజకీయంగా ప్రాధాన్యమైన అంశంగా చూస్తుండగా.. ప్రభుత్వం మాత్రం ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగానే దీనిని వివరిస్తోంది.

### జనసేన కూడా రంగంలోకి..

మరోవైపు జనసేన కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. 'స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమం' పేరుతో బుధవారం తాడేపల్లిలో సమావేశం నిర్వహించింది. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నాయకత్వం సూచించినట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో తమ పార్టీకి తగిన ప్రాతినిధ్యం ఉండాలనే అంశాన్ని జనసేన ఇప్పటికే కూటమి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల సర్దుబాటుపై వివిధ సంఖ్యలు, ప్రతిపాదనలు రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే తుది సర్దుబాటుపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా పార్లమెంటరీ కూటమి సమావేశాల్లో పార్టీ విధానాన్ని మాత్రమే వెల్లడించాలని, సీట్ల కేటాయింపు, సర్దుబాట్లు పార్టీ అధ్యక్షుడి పరిధిలో ఉంటాయని నేతలకు సూచించినట్లు సమాచారం. పార్టీ శ్రేణుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

### పవన్ గైర్హాజరుపైనా చర్చ

మరోవైపు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొంతకాలంగా పలు ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మంత్రివర్గ సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు అసెంబ్లీ సమావేశాలకు కూడా ఆయన గైర్హాజరైన సందర్భాలున్నాయి. ఆరోగ్య కారణాలతో కొన్ని కార్యక్రమాలకు హాజరు కాలేదని అప్పట్లో వివరణలు వచ్చాయి. అసెంబ్లీ చివరి రోజు మాత్రం పవన్ కల్యాణ్ హాజరై జనసేన శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. అదే సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న నారా లోకేష్‌తో ఆయన భేటీ కాలేదన్న అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇద్దరూ కొద్ది నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారని, అయితే పరస్పరం కలుసుకోలేదని ప్రచారం జరిగింది. ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన కలెక్టర్ల సదస్సుకు కూడా పవన్ హాజరు కాలేదు. ఈ పరిణామాలన్నింటినీ కలిపి చూస్తున్న రాజకీయ విశ్లేషకులు కూటమిలో అంతర్గత సమన్వయంపై చర్చిస్తున్నారు. అయితే గైర్హాజరును రాజకీయ విభేదాలకు నేరుగా ముడిపెట్టడం కంటే ఆయా సందర్భాల్లో ఇచ్చిన అధికారిక వివరణలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని మరో వర్గం అభిప్రాయపడుతోంది.

### డీఎస్సీపై జనసేన మౌనం

కూటమి పార్టీల మధ్య మరో చర్చనీయాంశంగా డీఎస్సీ-2025 వ్యవహారం మారింది. డీఎస్సీపై వైసీపీ తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేస్తున్నప్పటికీ జనసేన నుంచి పెద్దగా స్పందన కనిపించకపోవడంపై టీడీపీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన, బీజేపీ నేతలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు జనసేన వర్గాల్లో మరో చర్చకు కారణమయ్యాయి. గతేడాది సెప్టెంబర్ 25న సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. పవన్ కల్యాణ్ ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. అయితే బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరంలో నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌తో కలిసి నియామక పత్రాలు అందించినట్లు ప్రస్తావించడం జనసేన వర్గాల్లో చర్చకు దారితీసినట్లు సమాచారం. డీఎస్సీ నియామకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో తమ పార్టీ అధినేత పేరును ఈ వ్యవహారంలోకి తీసుకురావడం పట్ల కొంతమంది జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### సోషల్ మీడియా సెగ

ఇక టీడీపీ, జనసేనల మధ్య దూరాన్ని పెంచుతున్న మరో అంశంగా సోషల్ మీడియా మారుతోంది. ఇరు పార్టీలకు చెందిన కొందరు కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పరస్పరం విమర్శలు చేసుకుంటుండటం కూటమి నాయకత్వానికి తలనొప్పిగా మారింది. రాజకీయ అంశాలతో పాటు సినిమా, కుటుంబ నేపథ్యాలపై కూడా పోస్టులు, వ్యాఖ్యలు పరస్పర దూషణలకు దారితీస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ సినిమా విషయంలో సీనియర్ ఎన్టీఆర్‌ను ట్రోల్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో విమర్శలు చేసినట్లు ప్రచారం జరిగింది. దీనికి ప్రతిగా కొందరు జనసైనికులు కూడా ఎన్టీఆర్‌పై వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియాలో అనవసర వ్యాఖ్యలు చేయొద్దని ఇరు పార్టీల నాయకత్వాలు తమ శ్రేణులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

### స్థానిక పోరే అసలు పరీక్ష!

మొత్తంగా చూస్తే.. అధికార కూటమిలో సమన్వయానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం మూడు పార్టీల మధ్య వాస్తవ బలాబలాలకు పరీక్షగా మారే అవకాశముంది. సీట్ల సర్దుబాటు ఎలా జరుగుతుంది? ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కుతాయి? క్షేత్రస్థాయిలో కేడర్ ఎలా స్పందిస్తుంది? అన్న అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే కూటమిలో అసలు సమీకరణాలు బయటపడే అవకాశం ఉంది.

# రైతు భాగస్వామిగా 'ఏఐ'

అమరావతి : దేశానికి అన్నం పెట్టే రైతు కాలంతో పాటు నడుస్తున్నాడు. ఒకప్పుడు వర్షాలు, వాతావరణ అంచనాలు, అనుభవమే పెట్టుబడిగా సాగిన వ్యవసాయ రంగంలోకి నేడు అధునాతన సాంకేతికత దూసుకొచ్చింది. అన్ని రంగాలను శాసిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) ఇప్పుడు అన్నదాతకు వెన్నెముకలా నిలుస్తోంది. విత్తనం మొదలు మార్కెట్లో పంట అమ్ముడయ్యే వరకు రైతుకు ఏఐ తోడ్పడుతోంది. వర్షాధార సాగు సవాళ్లు, వాతావరణ మార్పులు, కూలీల కొరత వంటి సమస్యల్ని ఎదుర్కొనేందుకు కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా ప్రభుత్వం కూడా 'భారత్-విస్తార్'తో ఏఐ సాధనాలను అందు బాటులోకి తెస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, డ్రోన్ల వినియోగం వంటి పథకాలు ఏఐ విప్లవానికి మరింత ఊతమిస్తున్నాయి.

**కచ్చితమైన సాగు** : సాధారణంగా పొలంలో పురుగు మందులు, ఎరువులు చల్లాలంటే పెద్దఎత్తున ఖర్చు అవుతుంది. ఏఐ ఆధారిత రోబోటిక్ ట్రాక్టర్లు, సెన్సర్లు వచ్చాక పరిస్థితి మారుతోంది. పొలంలో ఏ మొక్కకు తెగులు సోకిందో, ఎక్కడ ఎరువులు తక్కువగా ఉన్నాయో ఏఐ సెన్సర్లు ఇట్టే పసిగడతాయి. మొత్తం పొలానికి మందులు చల్లాల్సిన పని లేకుండా, కేవలం సమస్య ఉన్నచోట మాత్రమే డ్రోన్లు లేదా యంత్రాల ద్వారా పిచికారీ చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గుతాయి. నేలలోని తేమ, భూసారం, ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తగిన మోతాదులో నీటిని అందించే ఆటోమేటెడ్ ఇరిగేషన్ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఇక్రిశాట్ వంటి సంస్థలు రూపొందించిన 'ప్లాంటిక్స్' వంటి ఏఐ యాప్‌లు రైతులకు రక్షగా నిలుస్తున్నాయి. మొక్క ఆకుపై ఏర్పడిన చిన్న మచ్చను లేదా తెగులును ఫొటో తీసి యాప్‌లో చూపిస్తే చాలు.. అది ఏ వ్యాధో క్షణాల్లో చెప్పడంతో పాటు ఏ మందు వాడాలో సూచిస్తుంది. వాతావరణ మార్పులను ముందే అంచనావేసి ప్రకృతి విపత్తుల నుంచి పంటను కాపాడుకునేందుకు ఏఐ అలర్ట్‌లు ఇస్తున్నాయి.

**మార్కెట్ డిమాండ్ అంచనా** : పంట పండించడం ఎంత ముఖ్యమో దానికి సరైన గిట్టుబాటు ధర సాధించడం అంతకంటే ముఖ్యం. ఏఐ సాంకేతికత ఈ విషయంలోనూ అండగా నిలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలు, గత కొన్నేళ్ల దిగుబడుల సరళిని విశ్లేషించి ఏ రకం పంటకు ఎక్కడ డిమాండ్ ఉందో ఏఐ ఆధారిత ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌లు రైతులకు మార్గదర్శనం చేస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రైతులు నేరుగా ఎగుమతిదారులు, మార్కెట్ వర్గాలతో అనుసంధానమయ్యే అవకాశం లభిస్తోంది.

**వ్యవసాయ డ్రోన్లు**: పురుగుమందులు, ద్రవరూప ఎరువులను పొలం అంతటా సమానంగా కాకుండా ఎక్కడ తెగులు సోకిందో ఆ నిర్దిష్ట ప్రాంతంలో మాత్రమే పిచికారీ చేయడానికి ఏఐ డ్రోన్లు ఉపయోగపడతాయి. సోలార్ పవర్డ్ సాయిల్, క్రాప్ సెన్సర్లు: పొలం లో నేల తేమను, ఉష్ణోగ్రతను రియల్‌టైమ్ పట్టికలో గమనించి మొబైల్ ప్లాట్‌ఫారమ్‌లకు సమాచారం అందించేందుకు ఇవి ఉపకరిస్తాయి.

పంట కోత పూర్తయ్యాక దిగుబడిని నాణ్యత ఆధారంగా వేరు చేయడానికి ఏఐ కెమెరాలు ఉపయోగపడతాయి. ఇవి పండ్లు లేదా ధాన్యాల రంగు, పరిమాణం ఆధారంగా గ్రేడ్‌లను ఇస్తాయి.

**ఏఐ చాట్‌బాట్లు, డిజిటల్ సహాయకులు**: వాట్సప్ మరియు మొబైల్ యాప్‌ల ద్వారా(ఉదాహరణకు: పీఎంఎఫ్‌బీవై చాట్‌బాట్, ప్లాంటిక్స్ వంటివి) రైతులు అడిగే ప్రశ్నలకు వారి మాతృభాషలోనే క్షణాల్లో సమాధానాలు, సలహాలు అందించే వాయిస్/టెక్ట్స్ ఆధారిత ఏఐ అసిస్టెంట్లు అందుబాటులోకి వచ్చాయి. కూలీల కొరతను తీర్చడానికి పండిన పంటను గుర్తించి కోసే ఆటోమేటెడ్ రోబోటిక్ యంత్రాలు కొన్ని రకాల తోటల సాగులో ప్రయోగాత్మకంగా ఉపయోగపడు తున్నాయి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సంయుక్త తనిఖీలు



**సత్తెనపల్లి (ఎస్‌పీఎన్)** : సత్తెనపల్లి నుంచి పిడుగురాళ్ల, దాచేపల్లి వెళ్లే రహదారిపై రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్, మోటార్ వాహనాల తనిఖీ అధికారి , జాతీయ రహదారుల సంస్థ అధికారులు బుధవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా హైవేపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించారు. వాహనదారుల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, రహదారి రూపకల్పనలోని లోపాలు, భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు గాను సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రేడియంట్ స్టిక్కర్లు అమర్చడం వంటి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రహదారి భద్రత పెంచేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ సీఐ రమేష్, ఎంవీఐ జి. సంజీవ్ కుమార్, సీహెచ్. రాంబాబు, సత్తెనపల్లి టౌన్ సీఐ హైమారావు, రాజుపాలెం ఎస్సైలతో పాటు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లో ఉచిత ఆయుర్వేద నాడీ వైద్య శిబిరం



**పిడుగురాళ్ళ, (ఎస్‌పీఎన్)**: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ మరియు ప్రాంతీయ ఉప సంచాలకులు శేఖర్ రాజు ఆదేశాల మేరకు పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధిలోని బెల్లంకొండ డొంక బజారు నందు గల అంగన్వాడి పాఠశాల నందు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని పిడుగురాళ్ల ఆయుష్ శాఖ వైద్యురాలు డాక్టర్ కే. మేఘమాల గురువారం తెలిపారు. ఈ వైద్య శిబిరం నందు సుమారు 56 మందికి నాడీ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ మేఘమాల తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు.ఆమె తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది డి బాబు, అంగన్వాడి కార్యకర్త జయశ్రీ, అంగన్వాడి హెల్పర్ లక్ష్మి పాల్గొన్నారు.



## అమరావతి రోడ్డులో ఘనంగా 12వ గణేష్ మహోత్సవాలు



**గుంటూరు (ఎస్‌పిఎన్)** : గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో "ది రేజింగ్ బాయ్స్" యూత్ ఆధ్వర్యంలో 12వ గణేష్ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి వైయస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగు నరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న అనంతరం సింగు నరసింహారావు మాట్లాడుతూ.. గుంటూరు నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రేజింగ్ బాయ్స్ సభ్యులు ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు వలివేటి అరవింద్ నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రవి యాదవ్, క్రిస్టియన్ మైనార్టీ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు ఆర్నాల్డ్, నాయకులు శ్రీకాంత్ యాదవ్, కృష్ణారెడ్డితో పాటు రేజింగ్ బాయ్స్ యూత్ సభ్యులు, స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్‌పిఎన్)**: స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి రూరల్ మండల ముఖ్య నాయకులతో సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా వాటిని కలిసికట్టుగా ఎదుర్కొని పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ తరపున బరిలో నిలిచే ప్రతి అభ్యర్థికి అవసరమైన లీగల్ టీం సహకారం అందుబాటులో ఉంటుందని, తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని, రానున్న రోజుల్లో వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి పార్టీ బాధ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 7వ వార్డులో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పర్యటన



**సత్తెనపల్లి టౌన్, (ఎస్‌పిఎన్)** : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా వైఎస్సార్సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సత్తెనపల్లి పట్టణంలోని 7వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రాబోయే స్థానిక ఎన్నికలపై చర్చించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వార్డులో పార్టీ పరిస్థితులు, ప్రజల సమస్యలు, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలను నాయకులు, కార్యకర్తలతో గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గుర్తింపు ఉంటుందని, రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా కలసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రజలతో మరింత మమేకం కావాలని సూచించారు. 7వ వార్డులో గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పర్యటనతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పించారు.


## తెలుగు వార్త వారపత్రిక - సత్తెనపల్లి న్యూస్

### సంప్రదించాల్సిన విలేకరుల వివరాలు

| వ.స | పేరు | హోదా / ప్రాంతం | ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 01 | మారూరి పుల్లారెడ్డి | స్టేట్ బ్యూరో | 97053 46857 |
| 02 | మొహమ్మద్ నజ్ నీన్ | సబ్ ఎడిటర్ | 85007 22367 |
| 03 | పేరేచర్ల శ్రీనివాస్ | ఏపీ & తెలంగాణ ఇంచార్జ్ | 98660 30499 |
| 04 | షేక్ చిన్న బాచ్చా సాహెబ్ (భాషా) | స్టేట్ కరస్పాండెంట్ | 63023 70349 |
| 05 | షేక్ ప్యారి జాన్ | స్టేట్ డివిజనల్ కరస్పాండెంట్ | 77803 47272 |
| 06 | చుండూరి ధనుంజయరావు | స్టేట్ మేనేజర్ | 96666 15177 |
| 07 | తుమ్మపూడి తిరుపతిరెడ్డి | గుంటూరు మేనేజర్ | 89780 61629 |
| 08 | గుండవరపు అమర్ నాథ్ | స్టేట్ ఆధ్యాత్మిక ఇంచార్జ్ | 93901 32978 |
| 09 | కె. విజయ | బాపట్ల బ్యూరో | 76610 87273 |
| 10 | పేరేచర్ల అఖిల్ (L.L.B) | పల్నాడు జిల్లా బ్యూరో చీఫ్ | 80085 40306 |
| 11 | పోసిపోగు వంశీ | పెదకూరపాడు ఇంచార్జ్ | 83284 31860 |
| 12 | తుమ్మల వెంకటేష్ బాబు | సత్తెనపల్లి ఆర్సి ఇంచార్జ్ | 99516 84230 |
| 13 | కాటేపల్లి శేషుయాదవ్ | సత్తెనపల్లి టౌన్ | 91330 50808 |
| 14 | దుమాల చిన్నబాబు | సత్తెనపల్లి క్రైమ్ | 79932 96531 |
| 15 | నాగలింగేశ్వరరావు | ముప్పాళ్ళ | 9014683361 |
| 16 | కాకరపర్తి సీత రామ గుప్త | సత్తెనపల్లి రూరల్ | 9000394908 |
| 17 | షేక్ నాగూర్ బాషా | గుంటూరు స్టాఫ్ రిపోర్టర్ | 9848841212 |
| 18 | షేక్ హుస్సేన్ బి | ఆర్‌సి పిడుగురాళ్ల | 9573357552 |

# ఏపీలో ఎల్‌నినో ఎఫెక్ట్ కాదు.. 'ఎల్లో నినో' ఎఫెక్ట్: వైఎస్ జగన్

**తాడేపల్లి: రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని.. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికిపైగా వర్షపాతం లోటు ఉందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శులు, రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కరువు, వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడికి సంబంధించి జిల్లాల వారీగా స్థానిక పరిణామాలపై వైఎస్ జగన్ చర్చించారు.**



ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలూ వర్షపాతం లోటులోనే ఉన్నాయన్నారు. "688 మండలాల్లో దాదాపు 628 మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉన్నాయి. దాదాపు 332 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అన్నమయ్య జిల్లాలో 75 శాతం వర్షపాతం లోటు. సత్యసాయి జిల్లాలో 66 శాతం, ప్రకాశం జిల్లాలో 65 శాతం వర్షపాతం లోటు.

..చిత్తూరులో 58.5 శాతం, వైఎస్సార్ కడపలో 57 శాతం వర్షపాతం లోటు. తూర్పుగోదావరిలో 57 శాతం, మార్కాపురం-నంద్యాలలో 56 శాతం చొప్పున వర్షపాతం లోటు. విశాఖపట్నంలో 54 శాతం, అనంతపురంలో 51 శాతం వర్షపాతం లోటు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఫిబ్రవరిలోనే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు" అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"జూలై, ఆగస్టులో కూడా తీవ్ర వర్షపాతం లోటు కొనసాగినా కరువు కార్యాచరణ చేపట్టలేదు. ప్రభుత్వ మాటలు నమ్మి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకుపైగా నష్టపోయారు. సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైంది. దాదాపు 20 లక్షల ఎకరాల్లో విత్తనం కూడా పడలేదు. సాగు చేసిన ప్రాంతాల్లో కూడా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటను బట్టి రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోయారు. కంది, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, వరి సహా అనేక పంటలు దెబ్బతిన్నాయి

పండ్ల తోటలు కూడా కరువు దెబ్బకు ఎండిపోతున్నాయి. శ్రీశైలం నీటిని సరైన సమయంలో రాయలసీమకు మళ్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పుడు చర్యలు తీసుకోలేదు. తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్ పరిధిలోని రిజర్వాయర్లను ముందుగానే నింపాల్సింది. పులిచింతల వద్ద తెలంగాణ చేపడుతున్న లిఫ్ట్‌లపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. పోలవరం పూర్తి సామర్థ్యంపై ప్రభుత్వం రాజీపడుతోంది. పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్ట్‌ల పేరుతో ప్రచారం కాకుండా శాశ్వత సాగునీటి పరిష్కారంపై దృష్టిపెట్టాలి" అని వైఎస్ జగన్ సూచించారు.

"వరుస వర్షపాతం లోటు కనిపిస్తున్నా కరువు మండలాలను ఎందుకు ప్రకటించడం లేదు?. కరువు ప్రభావిత మండలాలను తక్షణమే అధికారికంగా ప్రకటించాలి. కరువు ప్రభావిత రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. రైతులకు ఉచిత పంటల బీమాను వెంటనే పునరుద్ధరించాలి. రైతుల నుంచి వసూలు చేసిన పంటల బీమా ప్రీమియాన్ని తిరిగి చెల్లించాలి. గతంలో రైతులకు రావాల్సిన రూ.3 వేల కోట్ల పంటల బీమా పరిహారాన్ని వెంటనే చెల్లించాలి. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.15 వేల పరిహారం ఇవ్వాలి. పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.25 వేల పరిహారం ఇవ్వాలి" అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

"ఉచిత పంటల బీమా కొనసాగి ఉంటే రైతులకు ౹ాతీవజవత్‌వస ౹ాశీఉఅస్త్ర సహా బీమా రక్షణ ఉండేది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రావాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లించాలి. అన్నదాత సుఖీభవ కింద మూడేళ్లలో రూ.60 వేలు ఇవ్వాలి. ఇచ్చింది కేవలం రూ. 19 వేలే. బకాయి పడ్డ రూ. 41 వేలు కూడా రైతులకు ఇవ్వాలి. కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులైన రైతులకు మూడేళ్లలో ఎగ్గొట్టిన రూ. 60వేలు ఇవ్వాలి. తుఫాన్ల వల్ల రైతులకు పెండింగ్‌లో ఉన్న పంటల బీమా పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి. కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ప్రకటించాలి.

..ఇన్‌పుట్ సబ్సిడీ కింద సుమారు రూ. 6 వేల కోట్లు రైతులకు అందించాలి. సున్నా వడ్డీ పథకాన్ని తిరిగి అమలు చేయాలి. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన సున్నా వడ్డీ బకాయిలన్నీ రైతులకు చెల్లించాలి. పశుగ్రాసాన్ని ముందుగానే సమీకరించి కరువు జిల్లా రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలి. కరువు కారణంగా వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అక్టోబర్ నుంచి మార్చి వరకు అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలి. కరువు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కోసం కేంద్రాన్ని వెంటనే అదనపు పనిదినాలు కోరాలి. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే చెల్లించాలి.

..ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల రైతు, పేద కుటుంబాలపై అదనపు భారం పడకూడదు. విద్యా దీవెన--వసతి దీవెన కింద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.9 వేల కోట్లను విడుదల చేయాలి. కరువు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ఉచిత ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. గ్రామాల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలి. రైతులకు ప్రకటించిన ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను కోతలు లేకుండా అందించాలి. బోర్ల కింద ఉన్న పంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి.

..ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రతి రైతు కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలి. ఎండిపోతున్న పండ్ల తోటలను కాపాడేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలి. పండ్ల తోటలకు నీటి ట్యాంకర్ల ఖర్చుపై 80 శాతం సబ్సిడీ ఇవ్వాలి. ముఖ్యంగా చీనీ సహా శాశ్వత పండ్ల తోటలను కాపాడేందుకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలి" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

పరిస్థితి తీవ్రతను బట్టి కరువు ప్రభావిత ప్రాంతాల్లో తాను కూడా పర్యటిస్తానన్న వైఎస్ జగన్.. రైతులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ చేపడుతుందన్నారు. "ప్రతి జిల్లాలో కరువు పరిస్థితులపై పార్టీ నాయకులు అధ్యయనం చేసి ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా జిల్లాల వారీగా రైతుల ప్రత్యేక డిమాండ్లను కూడా ప్రభుత్వానికి సమర్పించాలి. రైతుల సమస్యలపై వైయస్సార్‌సీపీ నాయకులు క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలి. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రాలు ఇవ్వాలి. కరువు సమస్యలపై మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కార్యాచరణ చేపట్టాలి. దీనికి ముందు మండల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు రైతులతో సమావేశాలు నిర్వహించాలి. రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి" అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

"ఎల్‌నినో ప్రభావం వస్తుందని ఫిబ్రవరి 4నే చంద్రబాబు చెప్పారు. తెలిసినా ఆ తర్వాత చేసిన కార్యాచరణ మాత్రం సున్నా. ఇది ప్రకృతి వల్ల వచ్చిన కరువు మాత్రమే కాదు.. ముఖ్యమంత్రి స్పందించాల్సిన రీతిలో స్పందించకపోవడం వల్ల తీవ్రత పెరిగింది. వర్షపాతం లోటు కనిపిస్తున్నా స్విచ్‌లు నొక్కడం, లాకులు ఎత్తడం, ఫొటోలకు పోజులివ్వడమే చేశారు. మీ మాటలు నమ్మి సాగులోకి దిగిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి 20 వేలకుపైగా నష్టపోయారు. చంద్రబాబు పుణ్యాన రైతులకు ఉచిత పంటల బీమా రక్షణ లేకుండా పోయింది. రాష్ట్రంలో ఉన్నది ఎల్‌నినో ఎఫెక్ట్ కాదు... 'ఎల్లో నినో ఎఫెక్ట్'. శ్రీశైలం నుంచి రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగిన సమయంలో ఇవ్వకుండా, విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వదిలేశారు.

..పులిచింతల ఎగువ, దిగువన తెలంగాణ లిఫ్టులు కడుతున్నా చంద్రబాబు కనీసం నోరు మెదపడం లేదు. రైతుల కోసం చంద్రబాబు మనసు పెట్టి పనిచేస్తున్నారనే భావన ఎక్కడా కనిపించడం లేదు. పోలవరం పూర్తి స్థాయి నీటిమట్టంపై రాజీపడి రాష్ట్రానికి రావాల్సిన నీటి నిల్వ సామర్థ్యాన్ని వదులుకుంటున్నారు. గతంలోనే ఉన్న పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్టులను ఆపరేట్ చేసి కొత్తగా తానే నీళ్లు తెచ్చినట్టుగా చంద్రబాబు ప్రచారం చేస్తున్నారు.

..ఒకవైపు పోలవరంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని వదులుకుంటూ, మరోవైపు లిఫ్టుల పేరుతో డ్రామాలు చేస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టు వరుసగా వర్షపాతం లోటు కనిపిస్తున్నప్పుడు కరువు మండలాలను ఎందుకు ప్రకటించలేదు?. కర్ణాటక ముందుగానే కరువు ప్రకటించింది; చంద్రబాబు ప్రభుత్వం ఆ పని కూడా చేయలేకపోయింది. కరువు వస్తున్నా ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం చేయలేదు; పశుగ్రాసాన్ని జిల్లాలకు పంపలేదు; ఉపాధి హామీ అదనపు పనిదినాల కోసం డిమాండ్ కూడా పెట్టలేదు" అని వైఎస్ జగన్ మండిపడ్డారు.

## నడక మంచిదా.. యోగా మంచిదా?



వ్యాయామం అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి.. వాకింగ్, యోగ! పిల్లలు మొదలుకొని పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ చేయగలుగుతారు. అయితే, ఈ రెండిటిలో ఏది మన ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది? ఎలాంటి సమస్యలు ఉన్నవారు ఏది ఎంచుకోవాలి? అనే ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇస్తున్నారు.

మార్నింగ్ వాక్, యోగ.. రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే! అయితే, ఈ రెండిటి వల్ల కలిగే ప్రయోజనాలు, శరీరంపై చూపించే ప్రభావాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి, మీ శరీర అవసరాలు, ఆరోగ్యం, ఆశయాలను బట్టి ఏది ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చు.

**మార్నింగ్ వాక్:** ఇది అద్భుతమైన కార్డియో వ్యాయామం. శరీరాన్ని చురుగ్గా ఉంచడానికి.. నడక అనేది చాలా తేలికైన, ప్రభావవంతమైన మార్గం కూడా. మార్నింగ్ వాక్ వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కేలరీలు వేగంగా కరిగిపోతాయి. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి వాకింగ్ బాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరిగి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది. టైప్-2 మధుమేహం ఉన్నవారు మార్నింగ్ వాక్ చేస్తే.. ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. ఉదయాన్నే స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి మూడ్ మెరుగుపడుతుంది.

**యోగ:** యోగాభ్యాసం అంటే.. ఒక వ్యాయామం మాత్రమే కాదు. అది శరీరం, మనసు, శ్వాసల కలయిక. యోగాసనాల వల్ల కండరాలు, నరాలు సాగి.. శరీరం సరళంగా, చురుగ్గా తయారవుతుంది. జీవనశైలి లోపాల వల్ల వచ్చే నడుము నొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రాణాయామం, ధ్యానం వల్ల ఒత్తిడి, ఆందోళన పూర్తిగా తగ్గి, ఏకాగ్రత, నిద్ర లేమి సమస్యలు దూరమవుతాయి. వివిధ ఆసనాలు వేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. హార్మోన్ల సమతుల్యత సాధ్యమవుతుంది. నిటారుగా కూర్చోవడం, నిలబడటంలో శరీర ఆకృతి మెరుగుపడుతుంది.

**ఎవరికి ఏది మంచిది?**

బరువు తగ్గడం, గుండె ఆరోగ్యం, రక్తపోటు-షుగర్ నియంత్రణలో ఉంచుకోవడం మీ ప్రధాన లక్ష్యమైతే.. మార్నింగ్ వాక్ ఎంచుకోవడం మంచిది. ఇక ఒత్తిడి, శారీరక నొప్పుల నుంచి ఉపశమనం, ఫ్లెక్సిబిలిటీ, ప్రశాంతత కావాలనుకుంటే.. యోగాను ఆశ్రయించాలి. వీలైతే.. వారంలో మూడు నాలుగు రోజులు మార్నింగ్ వాక్, మిగతా రోజులు యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. ఇంకా మెరుగైన ఫలితాలు కావాలనుకుంటే.. ఉదయం 15-20 నిమిషాలు వాకింగ్ చేసి, మరో 15 నిమిషాలు తేలికపాటి యోగాసనాలు వేస్తే సరిపోతుంది.



## బోల్డ్ హారర్‌లో...

ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ కనిపించనంత బోల్డ్‌గా తమన్నా కనిపిస్తారని ఆమె కమిట్ అయిన తాజా చిత్రం స్పష్టం చేస్తోంది. ఇంతకీ అది ఏ సినిమా అంటే... బాలీవుడ్‌లో బోల్డ్ హారర్ మూవీగా పాపులర్ అయిన 'రాగిణి ఎంఎంఎస్'లోని మూడో భాగం. ఏక్తా కపూర్ నిర్మించిన 'రాగిణి ఎంఎంఎస్', ఆ చిత్రం సీక్వెల్ 'రాగిణి ఎంఎంఎస్ 2' ఘనవిజయాన్ని సొంతం చేసుకున్నాయి.

తొలి భాగంలో కైనాజ్ మోతీవాలా, రెండో భాగంలో సన్నీ లియోన్ లీడ్ రోల్స్ చేశారు. మూడో భాగంలో తమన్నా నటించనున్నారు. ఈ పాత్ర చాలా గ్లామరస్‌గా ఉంటుంది. అలాగే ఈ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌లో రొమాన్స్ మోతాదు కూడా ఎక్కువగానే ఉన్న విషయం రెండు భాగాలు చూసినవాళ్లకు తెలిసే ఉంటుంది. మూడో భాగంలో కూడా అలానే ఉంటుందని, మోడ్రన్ అమ్మాయిగా, ఆత్మగా తమన్నా రెండు షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో ఆయుష్ శర్మ సరసన ఆమె నటిస్తారు. తమన్నాకన్నా ఆయుష్ ఏడాది చిన్న. ఇంకా ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. శశాంక్ ఘోష్ దర్శకత్వంలో ఏక్తా కపూర్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.

## వినసొంపుగా 'రామాయణ' తొలి పాట

రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి జంటగా నటించిన భారీ బడ్జెట్ డివోషనల్ సినిమా 'రామాయణ'. దీపావళి సందర్భంగా థియేటర్లలో రిలీజ్ కానుంది. దాదాపు నెల క్రితం ట్రైలర్ వదిలారు. దానికి మిశ్రమ స్పందన వచ్చింది. కానీ ఇప్పుడు వినాయక చవితి సందర్భంగా 'జై జై రామ్' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు. ఇది వినసొంపుగా ఉంటూ అలరిస్తోంది. సీత కోసం స్వయంవరంలో పాల్గొనడం, ఇద్దరి పరిణయం తదితర సన్నివేశాలు ఈ గీతంలో చూపించారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, అర్జిత్ సింగ్ పాడారు. నితీష్ తివారీ ఈ చిత్రానికి దర్శకుడు. రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి చేయగా.. రావణుడిగా యష్ కనిపించబోతున్నాడు. ఇతర పాత్రల్లో వివేక్ ఒబెరాయ్, కాజల్ అగర్వాల్, సన్నీ డియోల్ లాంటి స్టార్ దర్శనమివ్వబోతున్నారు.



## 'అమ్మవారి'పై నయనతార భారీ ఆశలు



ఇంతకు ముందు నటి నయనతార ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆర్‌జే.బాలాజీ తెరకెక్కించిన సోషియల్ డివోషన్ కథా చిత్రం మూక్కుత్తి అమ్మన్. 2020లో విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది.

కాగా తాజాగా ఆ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం మూక్కుత్తి అమ్మన్ 2. ఐసరి గణేశన్‌కు చెందిన వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ, నయనతారకు చెందిన రౌడీ పిక్చర్స్ సంస్థ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి సుందర్.సీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులోనే టైటిల్ పాత్రను నటి నయనతార పోషిస్తున్నారు. నటి స్నేహా, రెజీనా, ఊర్వశి, అభినయ, ఇనియ, మైనా నందిని, యోగిబాబు, దునియా విజయ్, రామచంద్ర రాజు, అజయ్ గోష్, సింగంపులి, విచ్చు విశ్వనాథ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.దీనికి హిప్‌హాప్ తమిళా సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రంపై నటి నయనతార చాలా నమ్మకాన్ని పేట్టుకున్నారు. ఇటీవల ఒక బేటీలో ఆమె పేర్కొంటూ మూక్కుత్తి అమ్మన్- 2 చిత్రం తన కెరీర్‌లో చాలా ముఖ్యమైన కథా చిత్రం అని, మైలు రాయిగా నిలిచిపోతుందనే నమ్మకాన్ని వ్యక్తిం చేశారు. చిత్రం లో భావోద్రేకాలతో కూడిన పలు ఆశ్చర్యకరమైన అంశాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. దీంతో ఈ చిత్రంపై ఆసక్తి నెలకొంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.